# గీతోపనిషత్


(శ్రీమద్భగవద్గీత 10వ అధ్యాయము - విభూతి యోగము)


మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

# ధనిష్ఠ ప్రచురణలు















ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 10వ అధ్యాయము - విభూతి యోగము)

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2020 (59వ గురుపూజా మహోత్సవములు)

ప్రతులు : 1,000

© ధనిష్ఠ - 2020

వెల : రూ॥ **80-00**

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

website : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-39-5

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

మధురానగర్, విశాఖపట్నం.

ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 34 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ముందుమాట

అనుభూతి, విభూతి కొరకై జీవులు దేహధారణము కోరుచుందురు. జీవుల కోరిక మేరకే సృష్టి నిర్మాణము జరిగినది. సృష్టియందంతయు అంతర్లీనముగ సృష్టికి మూలమైన ఈశ్వరు డున్నాడు. అతనిని సమస్తమునందు దర్శించుట వలన జీవుని అనుభూతి, విభూతి పూర్ణమగును. అనుభూతి కొరకు, విభూతి కొరకు అన్వేషించుచు జీవుడు అనేకానేకమగు దేహములను ధరించుచున్నాడు. శాశ్వత ఆనందము, అనుభూతియే విభూతి. సమస్తమందలి ఈశ్వరుని యొక్క సాన్నిధ్యము లభించినపుడు, విభూతి పూర్ణమై జీవుడు అటుపై దేహధారణమునకు యిచ్చగించడు.

అభూతివలన మాటిమాటికి దేహధారణము జీవులకు కలుగుచున్నది. ఆకలిదప్పులు, కోరికలు పర్యవసానముగ జీవుని అభూతి ఆవరించి యుండును. అభూతి వలన జన్మపరంపర లేర్పడుట, ఆకలిదప్పులేర్పడుట, కోరిక లేర్పడుట, నిరంతరము జీవులను అసంపూర్ణముగనే యుంచును. దీనికి విరుగుడే విభూతి యోగము.

సమస్తమునందలి ఈశ్వరునే దర్శించుట జీవుడు నేర్చిననాడు, జీవుని తృష్ణవదలి, తృప్తి వరించును. తృప్తి గలవానికి సంతోషముండును. సంతోషముగ నుండు వానికి శుభములు కలుగు

చుండును. అట్టి సంతోషము ఈశ్వర సన్నిధానము వలన కలుగును. కనుక ప్రయత్నమంతయు ఈశ్వర దర్శనమునకే సమర్పించవలెను. అట్టివానికి క్రమముగ ఈశ్వర విభూతి అనుభవమునకు వచ్చును.

ఈ విభూతి యోగమున అంతర్యామియగు దైవము ఎన్ని విధములుగ తన సాన్నిధ్యము నిచ్చునో తెలుపబడినది. ఈశ్వర సాన్నిధ్యమునకు ఉపాయము కూడ తెలుపబడినది. శ్రద్ధాళువులగు సత్యాన్వేషకులకు విభూతియోగము ఒక చక్కని ఉపాయము. పఠించి ఆచరించు వారికి దివ్య విభూతి అందిన ఫలమై యుండగలదు. ఇది సత్యము.

ఈ ప్రచురణను సమర్పించిన **శ్రీ బి. సత్యనారాయణరాజు కుటుంబమునకు** శుభాశీస్సులు!

తేది 3-12-2019
మార్గశీర్ష శుద్ధ సప్తమి

**- పార్వతీకుమార్**

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1 | పరతత్త్వము | ....... | 11 |
| 2 | దైవ సంకల్పము | ....... | 14 |
| 3 | మహేశ్వరుడు | ....... | 16 |
| 4 | వైవిధ్య భావ స్థితి | ....... | 19 |
| 5 | దైవీ భావములు | ....... | 22 |
| 6 | దైవ యోగము | ....... | 25 |
| 7 | ఒకే తత్త్వము | ....... | 28 |
| 8 | నిత్య తృప్తి | ....... | 31 |
| 9 | భగవత్ ప్రీతి | ....... | 34 |
| 10 | భగవత్ స్పర్శ | ....... | 37 |
| 11 | పరిప్రశ్నము | ....... | 40 |
| 12 | దైవ విభూతి | ....... | 43 |
| 13 | నేనే! | ....... | 46 |
| 14 | విష్ణువు–సూర్యుడు–మరీచి–చంద్రుడు | ....... | 49 |
| 15 | సామవేదము–ఇంద్రుడు–మనస్సు–చైతన్యము | ..... | 53 |
| 16 | శంకరుడు–కుబేరుడు–పావకుడు–మేరువు | ....... | 57 |

| | | | |
|---|---|---|---|
| 17 | బృహస్పతి–స్కందుడు–సముద్రము | ....... | 62 |
| 18 | భృగువు–ఏకాక్షరము–జపయజ్ఞము–హిమాలయము..... | | 65 |
| 19 | అశ్వత్థము–నారదుడు–చిత్రరథుడు–కపిలుడు...... | | 69 |
| 20 | ఉచ్చైశ్రవసము–ఐరావతము–నరాధిపుడు | ....... | 73 |
| 21 | వజ్రాయుధము–కామధేనువు–కామదేవుడు–వాసుకి ..... | | 77 |
| 22 | అనంతుడు–వరుణుడు–అర్యముడు–యముడు .... | | 82 |
| 23 | ప్రహ్లాదుడు–కాలము–సింహము–గరుత్మంతుడు ... | | 85 |
| 24 | పవనుడు–రాముడు–మొసలి–జాహ్నవి | ....... | 90 |
| 25 | ఆది మధ్య అంత స్థితులు–అధ్యాత్మవిద్య–వాదనము..... | | 94 |
| 26 | అకారము–ద్వంద్వము–కాలము–విధాత | ....... | 97 |
| 27 | దైవ విభూతులు | ....... | 102 |
| 28 | బృహత్సామ–గాయత్రి–మార్గశీర్షము–వసంత ఋతువు..... | | 107 |
| 29 | జూదము–తేజస్సు–జయము–సత్వము | ....... | 110 |
| 30 | వాసుదేవుడు–ధనంజయుడు–వ్యాసుడు–శుక్రమూర్తి | | 114 |
| 31 | దండనము–నీతి–మౌనము–జ్ఞానము | ....... | 119 |
| 32 | బీజ స్వరూపము | ....... | 123 |
| 33 | దైవ విభూతులు | ....... | 125 |
| 34 | సమస్తము దైవమే ! | ....... | 127 |

# 1

## పరతత్త్వము

శ్రీభగవా నువాచ :

**భూయ ఏవ మహాబాహో శ్రుణు మే పరమం వచః ।**
**యత్తేఽహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా ॥ 1**

*తాత్పర్యము :* మహాబాహువులు గల ఓ అర్జునా! నీకు హితము కలుగ నుద్దేశించి పరమగు వాక్యమును నీకు చెప్పబోవు చున్నాను, వినుము. నీవు శ్రద్ధాసక్తులతో సంతోషముగ విను చుండుట వలన, ఈ పరమగు వాక్యమును తెలుపుచున్నాను.

*వివరణము :* ఆసక్తితో వినుచున్న శ్రద్ధాళువగు శ్రోతకు సద్గురువు అత్యంత హితము కలుగచేయు ఉపదేశము చేయును. సాధారణముగ బోధనలు వినువారు ఎందరో ఉందురు. విను చున్నపుడు దివ్య విషయముల గూర్చిన ఆసక్తి పెరుగుచుండ వలెను. అది శ్రోత ముఖమున బోధకునకు దర్శనమగును. శ్రోత శ్రద్ధను గమనించిన సద్గురువు అత్యంత హితము శ్రోతకు కలుగు నట్లుగ పరతత్త్వమును గూర్చిన ఉపదేశము చేయును. అట్టి

ఉపదేశము పొందిన శిష్యునికి దివ్య విభూతి అనుభూతమగును. "శృణు మే పరమం వచః" అని భగవానుడు సంబోధించుటలో పరమును వచించుచున్నాను సుమా! అను హెచ్చరిక యున్నది. మరియు నీకు హితము కూర్చుటకు వచించుచున్నాను అని కూడ పలికినాడు. "వక్ష్యామి హితకామ్యయా" శ్రోతలయందుగల ఆసక్తి, ఆర్ద్రత, భక్తి, శ్రద్ధ సద్గురువును ప్రోత్సహించును. అట్టి ప్రోత్సాహము కారణముగ లోతైన విషయములను శ్రోతకు తెలుపుటకు సద్గురు వుత్సహించును.

కొందరు సత్సాధకులు సద్విషయములను ఎంతవిన్నను ఇంకనూ వినుట కుత్సహింతురు. వారికి బోధన ప్రీతి కలిగించుచు నుండును. ప్రీతి కలుగుచున్నకొలది ముఖమందు వికాసము అవతరించుచు నుండును. అట్టి ప్రీతి సాధకుని కేర్పడనపుడు బోధన సాగదు. లేగదూడ ఆకలినిబట్టి ఆవు పొదుగును కుమ్ముచు నుండును. అది గమనించిన గోవు క్షీరమును వర్షించుచు నుండును. శిష్యుని ఆసక్తిని బట్టి, శ్రద్ధనుబట్టి, ఏకాగ్రతనుబట్టి గురువునుండి బోధ వ్యక్తమగును.

సద్బోధకుడు శ్రోతలను బట్టి బోధించునుగాని, విజ్ఞాన ప్రదర్శనలు, విన్యాసములు చేయడు. వచన, ప్రవచనముల ద్వారా ఎవ్వరిని ఆకర్షించడు. ఎవ్వరిపైన ప్రత్యేకించి తన ప్రభావము చూపడు. శ్రోతల జిజ్ఞాసనుబట్టి, వారికున్న జ్ఞానార్తిని

బట్టి బోధించుచు నుండును. బోధనలు శ్రోతలబట్టి యుండును గాని, బోధకుని బట్టి యుండవు. ఇది సత్యము.

శ్రీకృష్ణుడు అర్జునుని ముఖమున జ్ఞానమును గూర్చిన ఉత్కంఠ, ప్రీతి దర్శించెను. తాను ప్రవచించుట ఆపినను అర్జునుడూరుకొనడు. మరల పరిప్రశ్నము చేయును. అది గమనించిన భగవానుడు అర్జునునికి మరింత హితము కూర్చుటకై పరతత్త్వమును సృష్టియందెట్లు అనుభూతి చెందవచ్చునో తెలుపుట ఆరంభించినాడు.

## ②

## దైవ సంకల్పము

**న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః ।**
**అహ మాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః ॥ 2**

*తాత్పర్యము :* అర్జునా! నేను దేవతలు, మహర్షుల కన్న పూర్వము నుండి ఉన్నవాడను. అందువలన నా ప్రభావము వారెరుగరు.

*వివరణము :* పరము నుండి సృష్టి సంకల్పము ఉద్భవించుట పరమునకే తెలియును. పరమాత్మకే తెలియును. అతని నుండి ఏర్పడిన సంకల్పమే అతని ప్రభావము. సంకల్ప మేర్పడగానే కాలము, ప్రకృతి సుమకాలికముగ పుట్టినవి. అందుండి మహత్తు పుట్టినది. మహత్తు నుండి మహదహంకారము పుట్టినది. అందుండి సృష్టి సామాగ్రి 24 తత్త్వములుగ పుట్టినది. వానియందు పరమాత్మ ఉరుక్రముడై ప్రవేశించుట వలన బ్రహ్మాండము పుట్టినది. ఆ అండము పదివేల దివ్య సంవత్సరములకు విడివడి విరాట్పురుషు డేర్పడినాడు. విరాట్పురుషుని బొడ్డు నుండి సృష్టికర్త ఏర్పడినాడు. సృష్టికర్త నుండి దేవతలు, మహర్షులు ఏర్పడినారు.

సినిమా మొదలైన ఒక గంటకు, సినిమా హాలులో ప్రవేశించిన వానికి ముందేమి జరిగినదో తెలియదు. అట్లే ఈ మహర్షులకు, దేవతలకు పరమాత్మ నుండి సృష్టి ఎలా ప్రభవించినదో తెలియు అవకాశము లేదు. మన తాతముత్తాతలు ఎట్లు పుట్టిరో మనకు తెలియనట్లే దేవతలకు, మహర్షులకు పరమాత్మ, అతని ప్రభావము తెలియవు.

కాని ఈ దేవతలలో, మహర్షులలో పరమాత్మ, అతని ప్రభావము తెలిసినవారు ఏర్పడినారు. వారు తపస్సు ద్వారా తమ మూలము, సృష్టి మూలము ఎరిగిన వారయ్యారు. ఎరుగని దేవతలెందరో గలరు. మహర్షులు కూడ పూర్ణముగ తెలియక అహంకరించి భంగపడిన వారున్నారు. ఇంద్రుడు, అగ్ని, వాయువు వంటి వారు కూడ ప్రాథమికముగనే పరము తెలిసినవారు కాదు. పరము శాశ్వత తత్త్వము. అందుండి ప్రభవించిన సంకల్పము పరమునకు మాత్రమే తెలియును. దైవసంకల్పము దైవమునకే తెలియును. దైవము సంకల్పించిన వెనుక బ్రహ్మవేత్తలైన ఋషులకు, దేవతలకు తెలియును. పరతత్త్వ మెరిగినవారు కూడ పరముతో రమింపవచ్చునుగాని, పరము నుండి వెలువడిన సంకల్పము వెలువడుచున్నప్పుడు తెలియదు. ఉదాహరణకు శ్రీకృష్ణుని సంకల్పము తెలియక తికమక పడిన ఋషులు, యోగులు, దేవతలు ఎందరో కలరు.

## 3

## మహేశ్వరుడు

**యో మా మజ మనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్ ।**
**అసమ్మూఢ స్స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే ॥ 3**

తాత్పర్యము : అర్జునా! ఎవరైతే నన్ను జన్మించని వానిగను, ఆది లేని వానిగను, లోకము లన్నిటికిని ఈశ్వరుడుగను తెలుసు కొనుచున్నాడో, అట్టి మర్త్యుడు సర్వమాలిన్యముల నుండి విడువ బడుచున్నాడు.

*వివరణము* : ఆది, అంతము సృష్టింపబడు భూతముల కున్నవి. ఈశ్వరునకు, అతని అంశయైన జీవునికి ఆద్యంతములు లేవు. ఈశ్వరుడు అన్నిలోకములకు ఈశ్వరుడేకాక, జీవులకు కూడ ఈశ్వరుడు. కనుక అతడు మహేశ్వరుడు. ఈశ్వరుడు పుట్టడు, మరణించడు. జీవుడు గూడ అట్టివాడేగాని అజ్ఞానము చేత జనన మరణావస్థలను అనుభవించుచు నుండును. ఈశ్వరుడు అన్ని లోకములకు ఈశ్వరుడు కనుక అతడు మహేశ్వరుడు. ఒక్కొక్క లోకమునకు ఈశ్వరుడు వుండవచ్చును. అతనిని లోకేశ్వరుడని పిలుతురు. లోకేశ్వరునికి కూడ ఈశ్వరుడైనవాడు మహేశ్వరుడు.

మహేశ్వరుడు సృష్టి ఉన్నను లేకున్నను, అందు వసించు వారున్నను లేకున్నను తానుండును. సృష్టికి పూర్వము, సృష్టి యందు, ప్రళయము నందు, ప్రళయ అనంతరము ఉండు వాడు మహేశ్వరుడు. శాశ్వతముగ నుండువాడు అతడు. కనుక ఆది లేదు, అంతము గూడ లేదు. ఆది ఉన్నప్పుడే అంత ముండును. అనాది అయినవాడు అనంతుడు కూడ. అతనియందు ఉద్భ వించునది సృష్టి. అతనియందే పెరుగును. అతనియందే లయ మగును. సృష్టికి గల మార్పులేవియు అతనికి లేవు.

ఈశ్వరత్వము లేకున్నను జీవుడు కూడ ఈశ్వరునివలె సనాతనుడే. అతడు త్రిగుణములకు లోబడి వర్తించును. ఈశ్వరుడు త్రిగుణములకు కూడ ఈశ్వరుడే. త్రిగుణములకు లోబడిన జీవుడు పుట్టుట, మరణించుట, పెరుగుట - తరుగుట అను స్థితులను పొందుచుండును. అతడీశ్వర సాన్నిధ్యము కల్పించుకొని, ఈశ్వర అనుసంధానమున నున్నచో అజ్ఞానము తొలగినవాడై శాశ్వతుడుగ తనకు తాను తెలియును.

కనుక జీవుడు ఈశ్వరాంశగ తనను తానెరిగి, ఈశ్వరుని లక్షణములను బాగుగ ఉపాసన చేయవలెను. అట్లు చేసినచో, తాను సహజముగ శాశ్వతుడని తెలియును. ఈశ్వరాంశ యని తెలియును. సనాతనుడని తెలియును.

శ్రీకృష్ణునికి జనన మరణములు లేవు. అతడు సర్వలోకములకు ఈశ్వరుడు. అతడు పుట్టెనని, మరణించెనని భావించుట పూర్ణమగు అజ్ఞానము. పలుమార్లు విశ్వరూప దర్శనమిచ్చి, తన లోక మహేశ్వరత్వమును ప్రకటించెను. శ్రీకృష్ణ జన్మాష్టమి ఒక వేడుకయేగాని, అది పూర్ణసత్యము కాదు. శాశ్వతుడు, ఆద్యంతములు లేనివాడు పుట్టినట్లు భావించుటలో అంత సత్యము లేదు. ఈ శ్లోకమును ధ్యానించినపుడు ఈశ్వరుని లోక మహేశ్వరత్వము దర్శించుటయేగాక ఉపాసకుడు అజ్ఞానమను మలినము నుండి బయల్పడును.

(4)

## వైవిధ్య భావ స్థితి

**బుద్ధిర్జ్ఞాన మసమ్మోహః క్షమా సత్యం దమ శ్శమః ।**
**సుఖం దుఃఖం భవోఽభావో భయం చాభయ మేవ చ ॥ 4**

**అహింసా సమతా తుష్టి స్తపో దానం యశోఽయశః ।**
**భవంతి భావా భూతానాం మత్త ఏవ పృథ గ్విధాః ॥ 5**

*తాత్పర్యము :* నా వలననే భూతములకు (జీవులకు) అనేక విధమగు భావములు కలుగుట, కలుగకుండుట జరుగుచున్నది. సుఖము- దుఃఖము, భయము - అభయము, హింస-అహింస, సమదృష్టి - సంతుష్టి, తపస్సు - దానము, కీర్తి - అపకీర్తి, జ్ఞానా జ్ఞానములు, మోహము - శోకము, శమము - దమము నా వలననే జీవులకు కలుగుచున్నవి.

*వివరణము :* జీవులకు భావస్థితి, అభావ స్థితి కలుగు చుండును. అట్లే భయముండుట లేకుండుట కలుగుచుండును. అహింస, హింస భావములు కలుగుచుండును. అపుడపుడు సమదృష్టి, సంతుష్టి కలుగుచుండును. కీర్తి యందు ఆశ, అపకీర్తి

యన్న భయము కలుగుచుండును. సుఖము అను భావము కలుగును. దుఃఖ భావములు కూడ కలుగును. ఇంద్రియ లోలత్వము, ఇంద్రియ నిగ్రహము అనెడి భావములు కలుగు చుండును. మోహభావము, శోకభావము కలుగుచుండును.

అంతేకాక సత్యము, దయ, నేర్పు, సూక్ష్మ గ్రహణమును గూర్చిన భావములు కలుగును. మరియు జ్ఞాన సముపార్జనము, దానము, తపస్సును గూర్చిన భావములు కూడ కలుగును. అపుడపుడు ఏ భావములు లేకుండుట కూడ సంభవించును.

ఇట్లు అపరిమితముగ, వైవిధ్యముగ లక్షలాది భావములు కలుగుచుండును. ఇది ప్రకృతి సహజము. ప్రకృతికి లోబడిన జీవులకు ఈ వైవిధ్య భావ స్థితి తప్పదు. ఈ భావము లన్నియు ప్రకృతి నుండి పుట్టుచున్నవి. ప్రకృతి ఈశ్వరుని నుండి పుట్టును. కనుక తన నుండియే ఈ భావములన్నీ జీవులకు కలుగుచున్నవి. తాను ప్రకృతి కతీతుడు కనుక ఈ భావ వైవిధ్యము యొక్క ప్రభావము ఈశ్వరునిపై యుండదు. తన ప్రకృతి నుండి కలుగు చున్న భావములు జీవుల నేవిధముగ పదునాలుగు లోకముల లోను వర్తింపజేయుచున్నవో ఈశ్వరుడు చూచుచు నుండును. వినోదించును కూడ. ఆసక్తికరముగ గమనించు చుండును.

మనము సినిమా చూచినపుడు వైవిధ్యముతో కూడిన అనేక పాత్రలను చూచి వినోదించుట లేదా! అట్లే మనయందు

కలుగుచున్న వైవిధ్య భావములను, అభావములను మనము గమనింప వచ్చును గదా! అట్లు గమనింపగలుగుట సాధ్యపడు విషయము. మనము ఈశ్వరాంశలమే గనుక మన ప్రకృతి నుండి జనించు భావములను మనమే గమనింపవచ్చును. మనము ఆ భావముల యందు కాని, మన ప్రకృతి యందుకాని సమ్మిళితము కానవసరము లేదు. అపుడపుడు సమ్మిళితమైనను అందుండి బయల్పడవచ్చును.

ఈశ్వరుడు ప్రకృతికి అతీతుడు కనుక అతడెపుడును సమ్మిళితము కాడు. అతీతముగనే యుండును. జీవుడు ప్రకృతికి అధీనుడు గనుక సమ్మిళితమై వైవిధ్య భావముల అనుభూతిని పొందుచు నుండును. కనుక జీవునికి ఈశ్వరుడు ధ్యేయమై యుండవలెను. ఈశ్వరాంశ సంధానమునకై ప్రయత్నింపవలెను. ఈశ్వర సాన్నిధ్యమున నిలచిన జీవుని ప్రకృతి స్పృశించదు. అట్టి సాన్నిధ్యము లేనినాడు ప్రకృతి నుండి జనించు భావములు వ్యక్తిగత ప్రకృతి యందు గూడ జనింపగలవు. జీవులను బలాత్కారముగ కార్యములలోనికి నెట్టగలవు. ఇట్లు తన ప్రకృతి జాలము నిర్వర్తించుచున్న వైభవమును దర్శింపమని భగవానుడు ఉపాయము నిచ్చినాడు.

## 5

## దైవీ భావములు

**మహర్షయ స్సప్త పూర్వే చత్వారో మనవ స్తథా ।**
**మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః ॥ 6**

*తాత్పర్యము :* సప్తర్షులు, సనకాది నలుగురు మునులు, మనువులు నా మనసు నుండి పుట్టిన భావములు. వారినుండే సమస్త జీవులు పుట్టినవి.

*వివరణము :* మన ప్రకృతి నుండి మన మనసు ద్వారా మనకు భావములు కలుగుచున్నవి. వాటి ననుసరించి మన జీవితములను నిర్వర్తించుకొనుచు ఉన్నాము. లోకము లన్నిటికి ఈశ్వరుడైన వాని నుండి జనించిన దైవీ ప్రకృతి నుండి దైవీ భావములు లేక ఈశ్వరుని భావములు వ్యక్తమగుతూ ఉంటాయి. ఈశ్వర ప్రకృతిని దైవీ ప్రకృతియని, దివ్యప్రకృతియని సంబోధిస్తూ ఉంటాము. ఈశ్వరాంశ యగు మన నుండి మన ప్రకృతి వ్యక్తమగుతూ ఉంటుంది. ఈశ్వరుని ప్రకృతి పరిశుద్ధమై ఉండుట చేత, పరిశుద్ధ భావములు వ్యక్తమవుతూ ఉంటాయి. మన ప్రకృతి యందలి పరిశుద్ధతను బట్టి మన భావము లేర్పడుతూ ఉంటాయి.

ఈశ్వరుని యందు, మనయందు జరుగుచున్న ప్రక్రియ యొక్కటియే. అతని ప్రకృతి ద్వారా అతనికి భావము లేర్పడు చున్నట్లే మన ప్రకృతి ద్వారా మనకు భావము లేర్పడుతుంటాయి. దైవీ భావములు దివ్యమై దీర్ఘకాలము సృష్టికి శ్రేయస్సు కలిగిస్తూ ఉంటాయి. మన భావములు అంత దీర్ఘకాలము జీవించి యుండవు. పరిశుద్ధతలో తేడాను బట్టి వారి అయుస్సు, వాని శ్రేయస్సు యొక్క ప్రభావం ఉంటుంది. ఉదాహరణకు మనమొక శివాలయము నేర్పరచి, అందు శివలింగమును ప్రతిష్ఠ చేసి నపుడు, మనయందలి పరిశుద్ధతను బట్టి ఆ ఆలయము కొంత కాలము వర్థిల్లి, అటుపైన అభిషేక అర్చనాది సేవలు లేక మూత బడవచ్చును. కాని ఒక అగస్త్య మహర్షి, ఒక వేదవ్యాస మహర్షి ఒక శివలింగమును స్థాపించినచో అది చిరకాలము అభిషేక అర్చనాది కార్యక్రమములతో యుగముల తరబడి యుండును. పరిశుద్ధత యందలి వ్యత్యాసమును బట్టి ఒక సంకల్పము, ఒక ఆయుః ప్రమాణము, శ్రేయస్సు ఉంటాయి.

ఈశ్వరుని నుండి అతని ప్రకృతి ద్వారా, మనసు ద్వారా వెలువడిన భావములే సనక సనందనాది నలుగురు కుమారులు, సప్తర్షులు, మరువులు. వీరిని గూర్చిన భావము లన్నియు తన మనస్సు నుండి జనించినవని భగవానుడు పలుకుచున్నాడు. అతడు శాశ్వతుడు గనుక అతని భావములుగ వ్యక్తమైన

కుమారులు, సప్త ఋషులు, మనువులు శాశ్వతముగ సృష్టి యున్నంత కాలము యుందురు. లోకహితము గావించు చుందురు. ఈశ్వరుని మనస్సే చతుర్ముఖ బ్రహ్మ దేవుడు. అతని మనస్సు నుండి వీరందరు వ్యక్తమగుటచే వీరిని బ్రహ్మమానస పుత్రులందురు. బ్రహ్మగూడ ఈశ్వరుని ప్రకృతి నుండి వ్యక్తమైన వాడే. కనుక అతడు కూడ సృష్ట్యంతము వరకు నుండును. దైవీ ప్రకృతి సృష్టికొరకై దైవము నుండి వ్యక్తమగును. కనుక దైవీ ప్రకృతికూడ సృష్ట్యంత ముండును.

తన నుండి ఏర్పడిన ప్రకృతి, తన ప్రకృతి నుండి ఏర్పడిన సృష్టికర్తయగు బ్రహ్మ, అతని ద్వారా ఏర్పడిన భావములగు కుమారులు, సప్త ఋషులు, మనువులు, అందరును ఈశ్వర విభూతులే. ఈ విభూతులు సృష్టి అంతము వరకు లోకములకు తోడ్పడుచు నుండును. ఇట్టి విభూతులే మరికొన్ని ఈ అధ్యాయమున దైవము పేర్కొనినాడు.

6

## దైవ యోగము

**ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః ।**
**సోఽవికంపేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః ॥ 7**

*తాత్పర్యము :* ఎవరైతే నాతోను, నా విభూతితోను యోగము చెందియుందురో వారు తత్త్వవేత్తలు. అట్టి వారికి అచలమైన యోగము సిద్ధిస్తుంది. ఇందు సందేహము లేదు.

*వివరణము :* సర్వ వ్యాపకము, సర్వజ్ఞము, సర్వ శక్తి మంతము యగు పరతత్త్వము ఇహమునందు కూడ వ్యాప్తి చెంది యున్నది. ఇహపరములయందు వ్యాప్తి చెందిన "నేను" అను తత్త్వముతో సర్వ కాలములందు, సర్వ దేశములయందు, సర్వ రూపముల యందు, సర్వ నామములయందు కూడియుండుట "నా" యోగమని తొమ్మిదవ (9) అధ్యాయమున భగవానుడు పలికినాడు. అట్టి వాని ప్రధానమగు భావములు అతని విభూతులుగ పేర్కొనబడినవి. ఆ విభూతులతో కూడినను, తనతో కూడిన పరమానందమే యుండును అని దైవము తెలుపు చున్నాడు.

సృష్టి సమస్తము భగవంతుని భావము. అతని భావములే 4, 5 శ్లోకములలో క్లుప్తముగ తెలిపినాడు. 6వ శ్లోకమున నలుగురు కుమారులు, ఏడుగురు ఋషులు, పధ్నాలుగుమంది మనువులు నా మనసు నుండే ఉద్భవించినారు అని తెలిపినాడు. ఇట్లు క్రమముగ ఒక అవగాహన క్రమమున సృష్టియంతయు, తన నుండి వ్యక్తమైన ప్రకృతినుండి వ్యక్తమైన భావములే గనుక, అంతటిని తన విభూతిగ దర్శించమని సూచించుచున్నాడు. అట్లు దర్శించడానికి యోగస్థితి అచలమై యుండునని తెలుపుచున్నాడు.

సామాన్యముగ భగవత్ సాధకులు, భగవత్పరమగు విషయమున ఆసక్తి బాగుగ నున్నను, సమస్తమును భగవత్ భావనగ, వైభవముగ, విభూతిగ దర్శింపరు. సాధకులందు దైవము, ఇతరము రెండును అనుభూతమగును. క్రమముగ ఇతరము కూడ దైవముగనె అనుభూతమగు విభూతి పరిపూర్తి యగును. భగవద్విభూతి కాని దేదియు లేదని తెలియుట తత్త్వము తెలియుట. తత్త్వవేత్త యనగ, సమస్తము నందు తత్త్వమును దర్శించువాడు. ప్రకృతి - పురుషులను దర్శించువాడు. అట్లు దర్శించుటకు ఒక సోపాన క్రమమున సాధకుల కొరకై ఈ విభూతి యోగమును అనుగ్రహించినాడు.

త్రిమూర్తుల యందు, త్రిశక్తులయందు మాత్రమే దైవమును చూచుట గాక, సనకాది కుమారులయందు, సప్త ఋషుల

యందు, పదునాలుగు మనువులయందు తననే దర్శించమని, క్రమముగ సాధకుని అవగాహన పరిధిని విస్తారము గావించు చున్నాడు. కనబడుచున్న సమస్తమును దైవముగనే చూచుట వరకు సాధకుని గొనిపోయి, సృష్టియందు ఎట్టి దానినైన నిరాక రించని స్థితికి గొనిపోవుటయే విభూతియోగ ఆశయము. అట్టి వానికి అంతయు దైవమే నిలచి, చలనము లేని దైవయోగము సంభవించునని ఈ శ్లోకమున వివరించినాడు.

## 7

## ఒకే తత్త్వము

**అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే ।**
**ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః ॥ 8**

*తాత్పర్యము :* పరిపూర్ణ భక్తిభావంతో నన్ను భజించు బుద్ధిమంతులు సమస్తమునకును ఉత్పత్తి కారణమైన వాడుగను, సమస్త ప్రవర్తనలకు కారణమైన వాడుగను నన్ను దర్శించుచు, భజించుచు నాతో కూడి యున్నారు.

*వివరణము :* ఏది చూచినను, ఏది వినినను, ఏది అనుభూతమైనను దానియందు దైవమునే గ్రహించుట అనన్యభక్తి. "ఇది అదే" అనియు, "అదే ఇది" అనియు భావించవలెనని ఉపనిషత్తులు చెప్పుచున్నవి. పిండియే రొట్టె. పిండియే అనేకమగు పిండి పదార్థములు. అనేకమగు పిండివంటలు ఒకే పిండినుండి చేయబడినను రుచులు, రూపములు, వర్తనములు వేరు వేరుగ ఏర్పడతాయి. పూరి, చపాతి, బజ్జి వగైరా వంటకములు రూపమందు, రుచియందు వేర్వేరు అనుభూతి నిచ్చుచున్నను, అన్నియు

గోధుమపిండి నుండియే ఏర్పడినట్లు, ఒకే తత్త్వము నుండి వైవిధ్యముతో కూడిన లోకములు, లోకులు, వారి ప్రవర్తనము ఏర్పడుచున్నవి.

బంగారముతో రాముని బొమ్మ, రావణుని బొమ్మ చేసినపుడు, రావణుని బొమ్మ నిరాకరింతురా? నిరాకరించరు. ఎందువలననగా, అందున్నది బంగారమే! అట్లే పాము, పక్షి పరస్పర విరుద్ధ భావములతో నున్నను, రెండిటి మూలము ఒకటేయని దర్శించువాడు తత్త్వవేత్త. పాము ప్రవర్తన, పక్షి ప్రవర్తన వేర్వేరుగ నున్నను మూల మొక్కటే. మూలమును దర్శించువానికి తన ప్రవర్తనమున భేదముండదు. రాయికూడ శివలింగమువలె గోచరించును. దేనియందు నిరాదరణగాని, నిరాకరణ గాని యుండదు. దైవము పామును ధరించినట్లు, పక్షిపై తిరుగుచున్నట్లు తెలుపుటలోని అంతరార్థ మిదియే. మట్టిని, బంగారమును సమాన భావముతో తాను ఆదరించుచున్నాను అని తెలుపుటకు భూదేవిని, శ్రీదేవిని హృదయయందే ధరించినట్లు తెలుపబడుచున్నది.

లోకరీతిని బట్టి కొన్నిటికి ప్రాముఖ్యముండును. కొన్నిటి కంత ప్రాముఖ్యత యుండదు. కాని ప్రాముఖ్యము లేని వాని యందు నిరాదరణము చూపుట అజ్ఞానము. నిరాదరణయే అజ్ఞానము. నిరాదరణము దేనియందూ కూడదు. నిరాదరణ కలవాడు సమభావము కలిగినవాడు కాదు. సమభావము లేని

వాడు పూర్ణ దర్శనమును పొందలేడు. కాగితము, వంద రూపాయల కాగితము కాగితమే. వందరూపాయల కాగితముపై ఆదరణ యుండవచ్చును కాని ఇతర కాగితములందు అనాదరణము, అశ్రద్ధ కూడదు. ఒక వస్తువునుగాని, ఒక జీవిని గాని, ఒక ప్రదేశమును గాని ఆదరించుట సమంజసమే. కాని ఇతర వస్తువులనుగాని, జీవులను గాని, ప్రదేశములనుగాని నిరాదరించుట అపచారము. మనము నిరాదరణము చేయు వానియందు కూడ దైవమున్నాడు కనుక నిరాకరించుట, ద్వేషించుట, కించపరచుట, హింసించుట జరుగరాదు. అపుడే పరిపూర్ణ దర్శనమునకు అర్హత కలుగును.

## 8

# నిత్య తృప్తి

**మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్ ।**
**కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥ 9**

*తాత్పర్యము :* తమ చిత్తము, ప్రాణములు నాకు సమర్పించుకున్న వారు పరస్పరము ఒకరికొకరు నా కథలను బోధించుకొనుచు, ముచ్చటించుకొనుచు నిత్య తృప్తిని, ఆనందమును పొందుచున్నారు.

*వివరణము :* సంసార జీవులు కర్మబంధములలో చిక్కుకొని, అడప దడప దైవమును తలచుచు నుందురు. వారు పొందు తృప్తి, ఆనందముకూడ అంతంత మాత్రమే. శాశ్వతానందము కొరకు, తృప్తికొరకు లోకమందలి అనేక విషయముల వెంట పరుగిడుచు నుందురు. వారప్పుడప్పుడు భగవత్ కథలు విన్నను, అవి లోనికి ఇంకవు. ఒక చెవిని వినగ మరొక చెవి నుండి బహిష్కృతమగును. రుచి పెరగదు. శాశ్వత రుచి ఏర్పడుటకు ప్రారబ్ధకర్మమే అవరోధమై యుండును.

ఎల్లప్పుడు భగవత్ కథలు వినుచు, ముచ్చటించుకొనుటకు ఇచ్ఛగించువారు అట్టి వారితోనే సాంగత్యము చేయవలెను. ఎప్పుడూ సద్గ్రంథపఠనము, సత్యబోధనము చేయుచు జీవించినచో జీవిత మెట్లు సాగును అని సందేహపడు వారుందురు. అట్టి సందేహమున్న వారు సమస్యలలో బంధింపబడుటయే విధిగ జరుగుచుండును.

నాలోని ఎరుక, మన ప్రాణము దైవమిచ్చినవే. అందువలన ప్రాణము లున్నంతవరకు దైవమును గూర్చియే భావింతును, భజింతును, కీర్తింతును, బోధింతును అనగలిగెడి ధీరత్వము జీవునికి పరిణామ క్రమమున తప్పక ఏర్పడును. అట్టివారు ధీరులు. వారి జీవితములు తృప్తిగ నడచును. ఆనందము అందిన ఫలమై యుండును. ఎందరో భగవద్భక్తులు దైవస్మరణమున తమను తాము మరచి జీవించిన వారున్నారు. ఇప్పుడునూ ఉన్నారు. అట్టి వారికి లోకపు విలువలతో సంబంధము లేదు. వారి జీవితములు స్వతంత్రమున, స్వేచ్ఛగ విహరించు విహంగములవలె ఉండును.

నైమిశారణ్యమున కలియుగారంభమున మునీంద్ర సమూహములు నేటికిని భగవత్ కథలను వినుచు, పాడుచు విశ్వమును మరచి జీవించుచు నున్నారు. శౌనకాది ముని సమూహములకు సూతమహర్షి నేటికిని దైవమును గూర్చిన కథలు వినిపించుచు నున్నారు. కలియుగాంతము వరకు సూతుని బోధ, మునుల

శ్రవణము సాగుచునే యుండును. అట్టి ముని సమూహములు నా భావము నుండి ఉద్భవించి, వైభవముతో వసించు చున్నారని భగవానుడు ఈ శ్లోకమున ప్రకటించుచున్నాడు. నిత్య భగవత్ కథా శ్రవణ సమూహములు నా విభూతియే అని పలుకుచున్నాడు. ఇట్టివారే లోకమందున్నను లోకాతీతులై ఉందురు. అట్టి అలౌకిక లోకమునే గోలోకమని సంబోధింతురు.

## 9

## భగవత్ ప్రీతి

**తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।**
**దదామి బుద్ధియోగం తం యేన మా ముపయాంతి తే ॥ 10**

*తాత్పర్యము :* ప్రీతిపూర్వకముగ నన్ను గూర్చి బోధించు కొనుచు, నా అవతార కథలను చెప్పుకొనుచు ఆనందముగ, తృప్తిగ నుండువారు నాతోనే కూడి యుండుటచే, అట్టి వారిని నన్ను నిత్యము పొందు బుద్ధి యోగమున నిలిపెదను. అట్టి బుద్ధి యోగమును నేనుగ యిచ్చు చున్నాను.

*వివరణము :* భక్తి వలన జ్ఞానము, ఆత్మజ్ఞానము కలుగుట సులభ పద్ధతి. జ్ఞానము వలన ఆత్మజ్ఞానము లభింపవలె నన్నచో భక్తి తప్పనిసరి. భక్తిలేని జ్ఞానము అహంకారమునకు దారిచూపునే గాని, ఆత్మయోగమునకు దారి చూపదు. భక్తి పునాదిగ జ్ఞాన మేర్పడుట, భక్తి జ్ఞానముల సౌలభ్యమున ఆత్మజ్ఞాన మేర్పడుట, దైవముతో యోగము చెందుట విధానము. జ్ఞానము వలన భగవత్ ప్రీతి కలుగుటయే భక్తియోగము. భగవత్ ప్రీతి లేనివారికి జ్ఞాన

మున్నను, భగవంతునితో యోగముండదు. వారి జ్ఞానము వారి కవరోధమై నిలచును.

భక్తి యనగా భగవంతుని యందు ప్రీతి మాత్రమే. ప్రీతి యున్నచోట తృప్తి, ఆనందము ఉండును. భగవంతుని యందు ప్రీతిచేతనే నారదాది దేవర్షులు, వశిష్ఠాది మహర్షులు, గోలోకవాసులు దైవముతో సతతము కూడి యుందురు. ప్రీతి లేనపుడు కూడిక యుండదు. యోగముండదు. భగవత్ ప్రీతియే భగవంతుని పొందుటకు, భగవంతునితో పొందబడుటకు మూలకారణమై యున్నది.

భగవత్ ప్రీతిలేని భగవత్ జ్ఞానము కేవలము పాండిత్యమై మిగిలిపోవును. జీవితము రసవత్తరము కానేరదు. తృప్తి యుండదు. అహంకారము నిండగ లోకమందు ఆధిక్యతకై పాటుపడుట యుండును.

కనుక ఈ శ్లోకమున దైవమొక ఉపాయమును తెలుపుచున్నాడు. తనపై ప్రీతి కారణముగ భక్తునికి తానే జ్ఞానమునకు ద్వారములు తెరతుననియు, బుద్ధి లోకమున స్థిరపరతుననియు, అంతియే కాక బుద్ధిలోక అంచులను దాటి ఆత్మయోగమును అనుగ్రహింతు ననియు వాగ్దానము చేయుచున్నాడు. ఇటీవలి కాలమున రామకృష్ణ పరమహంస భగవద్గీత మార్గమున సమస్త

జ్ఞానమును పొందెను. ఘనీభవించిన జ్ఞానముగనున్న వివేకానందుడు కూడ మార్గదర్శియై నిలచినాడు.

కనుక భగవంతుని యందు ప్రీతి పూర్ణమై యున్నచో భగవత్ యోగము, సమస్త జ్ఞానము లభించునని తెలియవలెను. ఎన్ని శాస్త్రములు శోధించినను, భగవత్ ప్రీతి లేనివారు, భగవంతుని పొందలేరు. యోగము సిద్ధించదు. జ్ఞానము వికటించును.

(10)

## భగవత్ స్పర్శ

**తేషామేవానుకమ్పార్థ మహ మజ్ఞానజం తమః ।**
**నాశయా మ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥ 11**

*తాత్పర్యము :* అట్టి భక్తులపై ప్రేమతో నేనే అనుస్పందించి వారి అంతఃకరణము నందు నిలచి, ప్రకాశమగు జ్ఞానదీపముతో, అజ్ఞాన జనకమగు అంధకారమును నశింపజేయు చున్నాను.

*వివరణము :* అట్టి భక్తులు అనగా నా యందు చిత్తము గలిగి, నన్ను గూర్చిన బోధనలు వినుచు, మహిమాన్వితమగు నా చరిత్రను కథలు కథలుగా చెప్పుకొనుచు ఆనందించువారు, మరియు నాయందు ప్రీతిచే మనసుతో నన్నుకూడి యుండువారు. అట్టి వారి అంతఃకరణమున దైవము తానే స్వయముగ నిలచి తోడునీడయై యుండుట, క్రమముగ అంతఃకరణము నుండియే సమస్త జ్ఞానమును బోధించుట జరుగును. అట్టి జ్ఞానబోధ వలన అజ్ఞానము నశించును. దీపమున్నచోట చీకటి నశించినట్లు అజ్ఞానము నశించును.

ఈ శ్లోకమందు విశేషముగ తెలుపబడినవి రెండు విషయములు. మొదటిది అనుకంప. రెండవది లోభావము. అనగా అంతఃకరణ భావము. భగవంతుని యందు ప్రీతి గలవారు భగవంతునే స్మరించుచు నుందురు. ప్రీతి వలన స్మరణ సతతము జరుగుచు నుండును. సతతము దైవమునే స్మరించునపుడు, భావ పరముగ దైవముతో కూడి యుండుట జరుగును. ప్రేయసి ప్రియుని మరువలేనట్లు, గోపికలు కృష్ణుని మరువలేనట్లు, భక్తులు దైవమును మరువలేరు. సతత చింతనముతో భావమయ లోకమున బాగుగ కూడి యుందురు. మీరాబాయి, రామకృష్ణ పరమహంస కూడ అట్టివారే.

భగవత్ ప్రీతి ఒక అనుగ్రహము. ఎపుడు, ఎవనికి భగవంతుని యందు ప్రీతి కలుగునో తెలుపుట కష్టము. లోకమునందు కూడ ఒకరిపై ఒకరికి ప్రేమ ఎందుకు కలుగునో తర్కమున కందదు. ప్రేమ, ప్రీతి పొందినవారు ఆ ప్రేమయందే లేక ప్రీతియందే జీవించుచు నుందురు. సతతము దేవుని గురించి భావించువారు అతని కథలే చెప్పుకొనుచుందురు. అతని గుణములనే వర్ణించుకొను చుందురు. అతనినే స్మరించుచు నుందురు.

తత్కారణముగ ప్రేమ స్వరూపుడగు భగవంతుడు భక్తునితో అనుస్పందన పొందును. ఈ అనుస్పందనమే అనుకంప. ప్రేయసి ప్రేమ తీవ్రతను బట్టి ప్రియుడు అనుస్పందించునట్లు, దైవము

అనుకంపించుట ఆరంభించును. దానితో భగవత్ స్పర్శ భక్తుని కేర్పడి, అతడు అంతరంగమున పరిశుద్ధుడగుచు నుండును.

అంతఃకరణ మావిధముగ దివ్యస్పర్శతో పరిశుద్ధము కాగా, భక్తునియందు త్రికరణశుద్ధి ఏర్పడి దైవసాన్నిధ్యమునకు వలసిన లోవేదిక ఏర్పడును. అందు దైవము బసచేసి, క్రమముగ తానే జ్ఞానబోధను గావించి, అజ్ఞానము నశింపజేయును. గొంగళి పురుగు సీతాకోక చిలుకగ మారినట్లు అజ్ఞానముతో కూడిన భక్తుడు మహా జ్ఞానియై విరాజిల్లును. ఇది భక్తుని యందు భగవంతుడు చూపు విభూతి.

"నా భక్తులు నన్ను గూర్చి ఎచ్చట పరవశమున గానము చేయుదురో, అట్టి భక్తులయందు నేను వసించి యుందును." అని నారదునకు శ్రీకృష్ణుడు చెప్పినట్లుగ, అదే విషయము 9, 10, 11 శ్లోకములలో దైవము ప్రకటించినాడు.

## 11

## పరిప్రశ్నము

అర్జున ఉవాచ :

పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్ ।
పురుషం శాశ్వతం దివ్య మాదిదేవ మజం విభుమ్ ॥ 12

ఆహుస్త్వాం ఋషయ స్సర్వే దేవర్షి ర్నారదస్తథా ।
అసితో దేవలో వ్యాస స్స్వయం చైవ బ్రవీషి మే ॥ 13

సర్వమేత దృతం మన్యే యన్మాం వదసి కేశవ ।
న హి తే భగవన్ వ్యక్తిం విదుర్దేవా న దానవాః ॥ 14

స్వయమే వాత్మనాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ ।
భూతభావన భూతేశ దేవదేవ జగత్పతే ॥ 15

వక్తుమర్హ స్యశేషేణ దివ్యా హ్యాత్మవిభూతయః ।
యాభి ర్విభూతిభి ర్లోకా నిమాం స్త్వం వ్యాప్య తిష్ఠసి ॥ 16

కథం విద్యా మహం యోగిం స్త్వాం సదా పరిచింతయన్ ।
కేషు కేషు చ భావేషు చింత్యోఽసి భగవ న్మయా ॥ 17

**విస్త రేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన ।**
**భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్ ॥ 18**

తాత్పర్యము : శ్రీకృష్ణా! నీవు పరబ్రహ్మవు. పరంధాముడవు. పరమ పవిత్రుడవు. నీవు నిత్యడవని, దివ్య పురుషుడువని, దేవతలకు కూడ మూలమైన వాడవని, జన్మరహితుడవని, సర్వ వ్యాపకుడవని దేవర్షి నారదుడు, అసితుడు, దేవళుడు, సర్వఋషులు చెప్పుచు నుందురు. నిన్ను గురించి నీవు చెప్పుచున్నది గూడ అట్లే యున్నది.

నీవు చెప్పుచున్నదంతయు సత్యమని నాకు దృఢముగ అనిపించు చున్నది. నిజమునకు నీ గురించి నీకు తెలిసినంత మరెవ్వరికిని తెలియదు గదా! ఎవ్వరునూ తెలియలేరు గదా! సమస్త ప్రాణికోటికిని మూలమైనవాడవు, నియామకుడవు అగు నీవు మాత్రమే నిన్ను గూర్చి పూర్ణముగ తెలిసి యుందువు. కనుక ఈ లోకము లన్నిటియందు వ్యాప్తి చెందియున్న నీ విభూతిని నీవే సంపూర్ణముగ తెలుపుటకు తగినవాడవు. నిన్ను యేయే రూపములందు ఏ ప్రకారము ధ్యానించినచో బాగుండునో నీవే నా యందు దయతో తెలుపుము. నీ వాక్యములు వినుటకు నాకమితమగు ఆసక్తి యున్నది. అమృతమయమైన నీ వాక్కు నాకు అత్యంతమగు ఆనందము కలిగించు చున్నది. తృప్తి కలుగుట లేదు.

పై విధముగ అర్జునుడు చేసిన పరిప్రశ్నము 12వ శ్లోకము నుండి 18వ శ్లోకము వరకు ఉన్నది. అర్జునునికి కృష్ణుని బోధ అత్యంత ఉత్కంఠభరిత మగుటచే విస్తారముగ పరిప్రశ్నము చేసి నాడు. సద్గురు వాక్యమందలి సత్యము సత్సాధకుని ఆకర్షించుచు నుండును. అందువలన సత్సాధకునకు సద్గురువును ఎన్నిమార్లు చూచినను మరల మరల చూడవలె ననిపించును. ఎన్నిమార్లు విన్నను ఇంకనూ వినవలె ననిపించును. సద్గురు దర్శనము, శ్రవణము అనుస్యూతము వికాసము కలిగించుట వలన తృప్తి పొందుట యుండును. నిమిత్త కారణము లేవో ఏర్పరచుకొని, మాటి మాటికిని సద్గురువును చూచుటకు ప్రయత్నించుట, వినుటకు ప్రయత్నించుట జరుగుచు నుండును. నరుడగు అర్జునుడు, గురువగు నారాయణుని చూచుచు, వినుచు యిట్టి ఉత్కంఠకు లోబడెను. ఇది సాధకుని యందుగల ఒక శుభ లక్షణము.

(12)

## దైవ విభూతి

శ్రీభగవా నువాచ :

**హంత తే కథయిష్యామి దివ్యా హ్యాత్మ విభూతయః ।**
**ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యంతో విస్తరస్య మే ॥ 19**

*తాత్పర్యము :* ఓ అర్జునా! నా యొక్క విభూతి విస్తారమునకు అంతము లేదు. ప్రాధాన్యత ననుసరించి నా విభూతులను కొన్ని నీకు వివరించెదను.

*వివరణము :* సృష్టి యంతయు భగవంతుని గూర్చిన విభూతియే. అతని అస్తిత్వము, అతని ప్రకాశము లేని వస్తు వేమియును లేదు. లోదృష్టి గల జ్ఞానికి సర్వమునందు భగవంతుని అస్తిత్వమే గోచరించును. ఆయన విభూతియే కనిపించును. కొన్నిటియందు దైవమును చూచుట, కొన్నిటి యందు చూడ లేకుండుట మానవునియందలి అపరిపక్వతకు తార్కాణము. మతము లన్నియు దైవ సమ్మతములే. అన్ని రకముల ఆరాధనలు దైవసమ్మతములే. దైవ సమ్మతము కానిది సృష్టియందేదియు

ఉండదు. సురాసురులు కూడ దైవము నుండి దిగివచ్చిన ప్రజాపతుల నుండియే దిగివచ్చుట జరుగుచున్నది. ఆదిత్యులు, దైత్యులు, సర్పములు, పక్షులు, దానవులు, మానవులు, సమస్త భూతకోటి దైవమునుండి దిగివచ్చిన ప్రజాపతుల నుండి దిగి వచ్చినవారే. అందరియందు దైవమున్నాడు. అన్నిటి యందు దైవమున్నది. దోమ, చీమ నుండి సృష్టి కర్తయగు బ్రహ్మవరకు దైవ విభూతియే యున్నది.

అన్ని ప్రదేశముల యందు కూడ దైవమే యున్నాడు. అన్ని కాలములయందు దైవమే యున్నాడు. కాలము, దేశము, నామము, రూపము- ఈ నాలుగు కోణములలో దైవమే తనను తాను ప్రకటించు కొనును. కనుక అతని విభూతిని సమగ్రముగ వివరించుట సాధ్యము కాదు. ఉదాహరణకు కొన్ని తెలిపినను, పాఠకులు వానికే పరిమితము కారాదు. పాఠకుల పరిమితత్త్వమును బట్టి దైవానుభూతి అసంపూర్ణమై యుండును.

తరువాత శ్లోకములలో కొన్ని విభూతులు దైవము తెలిపినంత మాత్రమున వానికే పరిమితమై, ఇతరములందు దర్శించకుండుట జ్ఞానము కాదు. "నాకన్న ఇతర మేమియు లేదు- మత్తః పరతరం నాస్తి" అని ముందు అధ్యాయములలోనే దైవము ప్రకటించినాడు. ఎన్నిమార్లు భగవద్గీత చదివినను తెలియవలసినది ఇది ఒక్కటియే. అంతయు దైవమే అయి ఉన్నపుడు దేనిని నిరాకరించ కుండుట

పూర్ణ జ్ఞానము. కాలమును బట్టి కష్టము - నష్టము, సుఖము-దుఃఖము, జయము - అపజయము, ఆరోగ్యము - అనారోగ్యము కలుగుచు నుండును. అట్టి ద్వంద్వములందు కూడ దైవమునే చూచుట నిజమగు యోగమార్గము - దైవయోగ మార్గము.

## 13

## నేనే!

**అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః ।**
**అహ మాదిశ్చ మధ్యం చ భూతానా మంత ఏవ చ ॥ 20**

*తాత్పర్యము :* నేనే సమస్త ప్రాణుల యొక్క హృదయమందు ఉన్నవాడను. ఆత్మలకు ఆత్మగా నున్నవాడను. ప్రాణికోట్లకు ఆది, మధ్యము, అంతముగూడ నేనే!

*వివరణము :* భగవంతుని విభూతులలో అతి ప్రధానమైన విభూతి అన్ని ఆత్మలయందు తానే వసించి యుండుట. కనుక భగవత్ సాన్నిధ్యము కోరువారు వారి హృదయమందలి అంత రాత్మను సమీపించుట, సన్నిధి చేరుట, దర్శించుట, అటుపైన అంతరాత్మ తానుగా నున్నాడని తెలియుట సాధించుకొన వచ్చును. ఆత్మలకు ఆత్మగా నున్నవాడను 'నేనే' అని దైవము పలుకుటలో అతని భూతమహేశ్వరత్వము తెలియుచున్నది. అతడాధారముగనే ఆత్మలకు పుట్టుట, పెరుగుట, నశించుట జరుగుచు నుండును. అతని నుండే సమస్తము వ్యక్తమై, అతని లోనికే సమస్తము లయ మగును.

వెండితెర ఆధారముగ అనేకమగు భూతముల ప్రకటనము, నర్తనము సాగుచు నుండును. సినిమా పూర్తి కాగానే వెండితెరయే మిగులును. సినిమా ప్రారంభమున కూడ వెండితెరయే యుండును. వెండితెర ఆధారముగ అనేకమగు పాత్రలు చిత్రకథలో ప్రవేశము చేయును. అందరికి మూలము వెండితెరయే. వెండితెరమీద ప్రతిబింబించు నాయకుడు, ప్రతినాయకుడు వెండితెర ఆధార ముగనే ప్రకటింపబడు చున్నారు. సృష్టి యందున్న సమస్తము నందును మూలమున నున్నవాడు దైవమే.

జీవునికి మూలము స్పందనము. స్పందనమునకు మూలము దైవము. మన ప్రాణ స్పందనమునకు ఆధారముగ నున్న వానిని తెలియుటకు, ఆ స్పందనముల మూలమునకు చేరుటకు ప్రయత్నించవలెను. అపుడందరి జీవులకు వారి స్పందనములకు ఆశ్రయమై యున్నవాడు ఒకే ఒక "నేను". ఈ నేనుకు అనేక నామము లున్నవి. నామ వైవిధ్యమున, రూప వైవిధ్యమున తికమక లేకుండుటకు "నేనే అందరి జీవుల హృదయము నందున్న వాడను" అని శ్రీకృష్ణుడు "నేను"గ పలికినాడు. "నాయందు గల దైవము 'నేనే'. ఆ నేను ఆధారముగ ఈ నేను ఉన్నది. అట్లే ఆ నేను ఆధారముగనే అనేకములగు నేను లున్నవి. ఈ నేనులకు రూప వైవిధ్యము, నామ వైవిధ్యము ఉన్నను మూలము అందరికిని మూలమున నున్నది నేనే. కనుక అందరి యందున్న నేనును

గుర్తించి కృతజ్ఞుడవై యుండుము.” ఏది ఆధారముగ మన మున్నామో, వానికెల్లపుడు కృతజ్ఞుడవై యుండుట ఒక సంస్కారము.

భగవంతుని ఈ విభూతి అత్యుత్తమమగు విభూతిగ భావింప వలెను. అన్నియు భగవత్ తత్త్వము నుండే ఏర్పడినపుడు అన్నిటిని ఆదరించుట, తగు విధముగ ప్రతిస్పందించుట ఉండవలెను. శత్రువుల హృదయమందుగూడ దైవమే ఉన్నాడను భావముతో, వారితో తగు విధముగ ప్రతిస్పందించుట రాజయోగుల కర్తవ్యమై యున్నది. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు విశేషముగ శత్రుసంహారము చేసిరి. కాని వారి సంహారమున శత్రువులపై ద్వేషము లేదు. ధర్మ నిర్వహణమే యున్నది. వశిష్ఠాది మహర్షుల విషయమున గూడ ఇట్టి ఔన్నత్యము గోచరించును.

## (14)

## విష్ణువు - సూర్యుడు - మరీచి - చంద్రుడు

**ఆదిత్యానా మహం విష్ణు ర్జ్యోతిషాం రవి రంశుమాన్ ।**
**మరీచి ర్మరుతా మస్మి నక్షత్రాణా మహం శశీ ॥ 21**

*తాత్పర్యము :* ఆదిత్యులలో నేను విష్ణువును. ప్రకాశించు వారిలో కిరణములుగల సూర్యుడను. మరుత్తులలో మరీచను వాడను. నక్షత్రములలో చంద్రుడను.

*వివరణము :* తన విభూతులలో అదనముగా నాలుగు విభూతులను ఈ శ్లోకమున దైవము ప్రకటింపజేయు చున్నాడు. వారు వరుసగా విష్ణువు, సూర్యుడు, మరీచి, చంద్రుడు.

ఆదిత్యులు పన్నెండుగురు (12). వారందరిలోను తానే నిండి యున్నప్పటికిన్ని విశేషముగ విష్ణువు యందున్నానని దైవము తెలియజేయు చున్నాడు. విష్ణు వనగా వ్యాపన శక్తి. అతడు సమస్తము వ్యాప్తి చెంది, అన్నిట అంతట తానే నిండి యున్నాడు. ఆదిత్యు లందరికిని ఇట్టి వైభవము లేదు. విష్ణువునకు మాత్రమే యున్నది. పరతత్త్వమునకు గల వ్యాపకత్వము అందరి దేవతల యందు, ఋషులయందు గోచరింపదు. దృష్టి పెట్టినచో గోచరించు

బ్రహ్మర్షు లున్నారు. కాని ఎల్లపుడును విశ్వము నంతను వ్యాపించి ఎరుకతో నుండువారు శివకేశవులే! కేశవు డనగా విష్ణువు మరియు కృష్ణుడు. సర్వజ్ఞత కలిగియుండుట అత్యద్భుతమగు స్థితి. ఆదిత్యులలో విష్ణువుని కొక్కనికి మాత్రమే అట్టి వ్యాపక స్థితి యున్నది. విష్ణువు తన విభూతియే యని దైవము పలుకు చున్నాడు. కనుక విష్ణువారాధన పరదైవతము యొక్క ఆరాధనమే.

జీవులలో ఆత్మగ శివుడుండగ, ప్రజ్ఞగ విష్ణు వుండును. ఇరువురును సమస్త వ్యాప్తి కలిగి యున్నవారు. పరతత్త్వమునకు ప్రతీకలు.

సూర్యుని ప్రకాశముతో సమానమైన ప్రకాశము ఎచ్చటను కానరాదు. ఆకాశమున కన్పట్టుచున్న వెలుగు రూపములలో సూర్యునివంటి వాడు మరొకడు లేడు. సూర్యుని తేజస్సు, ప్రకాశ ముగ తానే యున్నానని దైవము పలుకుచున్నాడు. ఆ ప్రకాశము, తేజము తన వైభవమే అని తెలుపుచున్నాడు.

ఆదిత్యులు పన్నెండు (12) మంది. వీరదితి కుమారులు. సవితృమూర్తి, విష్ణువు ఇరువురును ఆదిత్యులే.

సప్త మరుత్తులలో తాను మరీచి అని దైవము పేర్కొన్నాడు. ఏడుగురు మరుత్తులు వరుసగా 1. ఆవహ, 2. ప్రవాహ, 3. నివహ, 4. పరాహ, 5. ఉద్వాహ, 6. సంవాహ, 7. పరివహ (మరీచి).

ఇందలి ఏడవ వాడైన పరీవహుడు అత్యంత ఆకర్షణలతో కూడిన కాంతి గలవాడు. కళ కలవాడు. ఇత నే రూపమున విశిష్టముగ నున్న ఆ రూపము అత్యంత ఆకర్షణీయముగను, కళగను చూపరు లకు తన్మయత్వము కలుగు విధముగ గోచరించును. ఉదాహర ణకు శ్రీరాముని యందు, శ్రీకృష్ణుని యందు మరీచి తత్త్వము అత్యధికమై అన్నిలోకములను మోహము గావించినది. శ్రీరామ, శ్రీకృష్ణుల రూపమునకు మోహము చెందని వారెవ్వరునూ లేరు. మహాత్ములయందు, సుక్షత్రియులందు గోచరించు కళ, అందము, ఆకర్షణ మరీచి తత్త్వమే. మారీచుడను రాక్షసుడు కూడ అమిత మగు ఆకర్షణ కలవాడగుటచే సీతమ్మ మాయా మృగమునకు ఆకర్షితురాలగుట జరిగినది. ఈ మరీచియను మరుత్తు భగవద్వి భూతి మెండుగ కలవాడు. వారందరికిని అగ్రగణ్యుడు. సత్య లోకమున విహరించువాడు.

నక్షత్రములలో చంద్రునియందు తానే ప్రకాశించు చున్నానని దైవము పలికినాడు. నిజమునకు చంద్రుడు శుక్ల కృష్ణ పక్షములకు గురియగు చుండును. శివానుగ్రహము కారణముగ నశింపక యుండును. అట్టి చంద్రగ్రహము నాధారముగ చేసుకొని దైవము అత్యద్భుతమగు సృష్టి కార్యము నిర్వర్తించుచు నున్నాడు. రస స్వరూపుడుగ సస్యములను పోషించుట, గర్భోత్పత్తి, గర్భధారణము, జీవుల శరీర నిర్మాణము, పోషణము, అన్ని లోకములకు అన్నము

అందించుచున్న సోముడను ప్రజ్ఞగ చంద్రుని నుండి, భూమి జీవుల ఉత్పత్తి, పోషణ మంతయు తాను నిర్వర్తించుచు యున్నాడు. చంద్రకిరణములే లేనిచో భూమిపై జీవులు మనజాలరు. చంద్రుడు రస స్వరూపమునకు ప్రతినిధి. సోమరసమే సృష్టి ఉత్పత్తికి, వృద్ధికి మూలమగు ప్రజ్ఞ. ఆ ప్రజ్ఞ మన భూమివరకు చంద్రుని నుండి పదిహేను (15) తిథుల ద్వారా శుక్ల కృష్ణ పక్షములుగ సంవత్సర మంతయు అందింపబడుచున్నది. అన్ని నక్షత్రముల ద్వారా ఆ నక్షత్ర ప్రభావము కూడ చంద్రుడు భూమి కందించుచు నుండును. ఇట్లు నక్షత్రములలో సంచరించు చంద్రుని కాంతి రూపమున తానే యున్నానని దైవము పలుకుచున్నాడు.

(15)

## సామవేదము - ఇంద్రుడు - మనస్సు - చైతన్యము

**వేదానాం సామవేదోఽస్మి దేవానా మస్మి వాసవః ।**
**ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానా మస్మి చేతనా ॥ 22**

*తాత్పర్యము :* వేదములలో సామవేదము నేను. దేవతలలో ఇంద్రుడను నేను. ఇంద్రియములలో మనస్సు నేను. భూతములలో చైతన్యము నేను.

*వివరణము :* దైవము మరి నాలుగు అంశలలో తన విభూతిని దర్శించి ఆనందించ వచ్చునని తెలుపుచున్నాడు. 1) ప్రాణాపాన వ్యాపారము ఒక స్పందనముగ సాగును. ప్రాణ స్పందనము ఒక పాట వంటిది. దానిని హంస గానమని, హంస గీతమని కవులు వర్ణించుచు నుందురు. స్పందనము వలన ప్రాణాపాన గతులు జరుగుచు నుండును. అన్నము, జలము, వాయువు మున్నగునవి జీవులు స్వీకరించి ప్రాణమయకోశమును సారముగ పొందుదురు. మరల మల పదార్థములను అపానమను ధర్మమున విసర్జించుట జరుగును. స్వీకరించుట, విసర్జించుట ప్రాణాపాన గతిగ జీవుడు

జీవించుచు నుండును. స్వీకరించుటకు ఉచ్ఛ్వాసము, విసర్జించు టకు నిశ్వాసము, ఒక దాని తరువాత ఒకటి పనిచేయు చుండగ, జీవుడు అన్నాదుల స్వీకరణము, మలాదుల విసర్జనము లయ బద్ధముగ నిర్వర్తించుకొనుచుండును. ఈ తాళ లయాత్మక మగు ప్రాణాపాన గతుల వలననే జీవకోట్లు, గ్రహగోళాదులు కూడ వర్ధిల్లుచున్నవి. ప్రాణాపానముల లయ తప్పినచో సృష్టి సమతుల్యత చెడును. కనుక స్థితి కారకుడుగ సృష్టిని స్థిరపరచుటకు తానే సామవేదముగా సృష్టియందు పనిచేయు చున్నానని, ఎచ్చట ప్రాణాపానముల గతి గోచరించినను, దాని మూలమగు స్పందనమును గుర్తించి, ఆ స్పందనము దైవమే అని భావించుట ఒక విభూతి. మానవుల యందును, జంతువుల యందును స్పందనము స్పష్టముగ గోచరించును. అట్లే వృక్షములందు, గ్రహములందు, అణువులందు కూడ స్పందనమున్నది. సూక్ష్మ దృష్టికి అదియును విదితమే. స్పందనము వలననే సృష్టియందు ఏదైనను స్థితిగొని యుండును. సమతుల్య మున్నపుడే సృష్టి యుండును. కనుక తనను సామముగ దర్శించమని, అట్లు దర్శించుటయే సామవేద దర్శనమని తెలుపుచున్నాడు.

2) దేవతలలో తాను ఇంద్రుడని పలికినాడు. అన్ని లోకములయందు దేవతా గణము లున్నవి. అనగా గుంపులు గుంపులుగా ప్రజ్ఞ లున్నవి. అట్టి ప్రజ్ఞలకు ఒక కేంద్రప్రజ్ఞ యున్నది.

అట్టి కేంద్ర ప్రజ్ఞనే ఇంద్రు డందురు. ఇంద్రుని వలన దేవతల గణములు చక్కగ పనిచేయుట యుండును. గురువున్న చోట శిష్యులు క్రమశిక్షణతో నుండుట, నాయకుడున్న చోట సేనలు భద్రముగ పనిచేయుట- ఇట్టివి చిన్న చిన్న గణముల నుండి పెద్ద పెద్ద గణముల వరకు భద్రత నిచ్చును. అట్టి ప్రజ్ఞను కేంద్రప్రజ్ఞ అందురు.

3) ఇంద్రియములు పది విధములుగ జీవునికి తోడ్పడును. అవి వరుసగ 1. చెవి, 2. చర్మము, 3. కన్ను, 4. నాలుక, 5. ముక్కు- ఇవి జ్ఞానేంద్రియములు. అటుపైన 6. వాక్కు, 7. చేతులు, 8. కాళ్లు, 9. మలద్వారము, 10. మూత్ర ద్వారము- ఇవి కర్మేంద్రియములు. ఈ పది ఇంద్రియములను అధిష్ఠించి వీటిని పాలించు ప్రజ్ఞ మనస్సు. ఇది పదకొండవ (11) ఇంద్రియ ముగా భావింపవచ్చును. ఈ పదకొండును్ను, పదకొండు రుద్రులచే పరిపాలింపబడు చున్నవి. వీనికి నాయకుడై యున్న మనస్సను ప్రజ్ఞగ నేనే యున్నాను అని దైవము పలుకుచున్నాడు. కనుక మనస్సు దైవమని తెలిసి, దానిని పవిత్రముగ నుంచుకొనవలెను. మనస్సు పవిత్రముగ నున్నచో, ఆ పవిత్రత దశేంద్రియములకు వ్యాపించును.

4) సమస్త జీవులలోని చేతనగ తానే యున్నానని తెలుపు చున్నాడు. చీమ, దోమ, నక్క, కుక్క, మనిషి, జంతువు, వృక్షము,

ఖనిజము, గోళములు ఇట్టి సమస్తమందలి కదలికగ నున్నవాడు, తెలివిగ నున్నవాడు తానే అని తెలుపుచున్నాడు. కదలిక యున్న చోటల్లా చేతన యున్నదని తెలియవలెను. వానపాము నుండి అన్ని జంతువుల యందుగల కదలికను దైవముగ దర్శించుట నిజమగు చైతన్య ఆరాధన. చైతన్యమే సమస్తమును కదలించు చున్నది. గ్రహ గోళాదుల తెలివిగ కూడ చైతన్యమే యున్నది. అణువులలో చైతన్యము కూడ దైవమే. బ్రహ్మాండ మందలి చైతన్యము కూడ దైవమే. ''అణోరణీయాన్ మహతోమహీయాన్'' అనునది వేదసూక్తి. అణువు నుండి మహత్తు వరకు, సమస్తము వరకు తానే కదలికగను, తెలివిగను యున్నాడని తెలిసిన వారికి, సమస్తము దైవ విభూతిగనే గోచరించును.

(16)

## శంకరుడు - కుబేరుడు - పావకుడు - మేరువు

**రుద్రాణాం శంకర శ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్ ।**
**వసూనాం పావకశ్చాస్మి మేరు శ్శిఖరిణా మహమ్ ॥ 23**

*తాత్పర్యము :* రుద్రులలో నేను శంకరుడను. యక్ష రక్షస్సులలో నేను కుబేరుడను. వసువులలో పావకుడను. శిఖరములలో మేరువును.

*వివరణము :* 1. రుద్రులు అంతరిక్ష దేవతలు. వారు సృష్టి యంతయు తరంగములవలె నిండి సృష్టికి తోడ్పాటు గావించినటువంటివారు. అందు శంకరుడు అత్యంత కీలకమైన తరంగము. 'శం' అనగా శాంతి. 'శం' అనగా యోగస్థితి. 'శం' అనగా సమతుల్యస్థితి. ఈ స్థితి యందు జ్ఞానము దర్శనమగును. శంకరుడు అనగా అట్టి ప్రశాంతతను, జ్ఞానమును కలిగించు వాడని అర్థము. శంకరుడు మయస్కరుడు కూడ. అనగా తాపములు పోగొట్టి, జీవికి అన్ని లోకములందు చల్లదనము కలిగించెడివాడు. చల్లని మంచు పర్వతములకు కూడ అతడు చల్లదన మీయగలడు. చల్లగ నుండు నాగుపాములకు, చంద్రునికి కూడ చల్లదన మిచ్చువాడు. రుద్రకాళిని సహితము చల్లబరచువాడు.

"*శంకరాయచ, మయస్కరాయచ*" అని రుద్రాధ్యాయము ప్రకటించుచు నున్నది. రుద్రులు సమస్త మూర్తులలో నిండి యున్న దైవము. శంకరత్వము పరిపూర్ణ విభూతి నిచ్చును. శంకరుడు ఉమాపతి. అనగా వ్యక్తా వ్యక్తములను అధిష్ఠించి యున్నవాడని అర్థము. అట్టి శంకరుడు నేనే అని దైవము పలుకుచున్నాడు.

2. కుబేరుడు విత్తేశుడు. అనగా సకల సృష్టి సంపదలకు అధిపతి. సృష్టి సంపద స్థూలముగను, సూక్ష్మముగను కూడ నున్నది. స్థూల సంపదను రక్షించువారు రక్షస్సులను ప్రజ్ఞలు. సూక్ష్మసంపదలను రక్షించువారు యక్షులు. యక్షులకు, రక్షస్సులకు కూడ ఈశ్వరుడుగ నున్నవాడు కుబేరుడు. సూక్ష్మ సంపదలను, స్థూల సంపదలను కూడగట్టి రక్షించుట తన కర్తవ్యముగ పనిచేయు చున్న ప్రజ్ఞను కుబేర ప్రజ్ఞ అందురు.

కుబేరుడు మానవుని శిరస్సునందలి శిఖయందుండును. అది ఉత్తరము. సృష్టి ఉత్తరదిక్కుయందు, జీవుల ఉత్తర దిక్కుయందు ఆశీనుడై యుండువాడు కుబేరుడు. కుబేరుని అధ్యక్షతనే జీవుని సూక్ష్మ స్థూల దేహములు కూడగట్టుకొనును. స్థూలమగు అణువులచే స్థూల దేహము, సూక్ష్మమగు అణువులచే సూక్ష్మ దేహము కుబేరుని అధీనముననే జరుగును. శిఖ నుండియే మానవ దేహ నిర్మాణమంతయు ప్రారంభమై పాదములందు అంతమగును. ఈ దేహమందలి అంతర్భాగములు కూడ ప్రజ్ఞా కేంద్రము

లతో కూడిన సూక్ష్మ రూపములు. సహస్రారము నుండి మూలాధారము వరకు నిక్షిప్తమై యుండును. ఇట్టి సృష్టి సంపదకు ఈశ్వరుడుగ నున్న కుబేరుడను నేనే అని దైవము పలుకుచున్నాడు. ధనమనగా సృష్టి సంపదయేగాని మన మేర్పరచుకొనిన రూపాయి నాణెములు కాదు. డాలర్లు కూడ కాదు.

3. పావకుడు పంచభూతములలో ఒకడైన అగ్ని. ఇతడు సమస్తమును పవిత్రీకరించు చుండును. దహించి పవిత్రీకరించుట ఇతని కార్యము. పృథివిని, జలమును పవిత్రీకరించుచు, పరివర్తనము గావించుచు నుండును. అట్లే జలములు వాయువుగను, వాయువులను జలములుగను పరివర్తనము గావించుచు నుండును. సముద్రపు ఉప్పునీటిని దహించి, ఆవిరి గావించి, వాయువును జేర్చి, వాయువును చల్లబరచి, ఆవిరిని మేఘములుగ జేసి, మేఘముల నుండి స్వచ్ఛమగు జలములను మరల భూమి కందించును. అట్లే జీవులయందు ఆహారము దహించి, అన్న శక్తిగ మార్చి దేహములను పోషించును. ఊష్ణము, జ్వరము రూపమున దేహమందలి రుగ్మతలను హరించి స్వస్థత నిచ్చును. సృష్టిని, జీవులను ఎప్పటికప్పుడు తగు విధముగ పవిత్రీకరించుచు నుండును. పవిత్రీకరణమే ఒక యజ్ఞదీక్షగ సృష్టియందు వర్తించును గనుక ఇతనిని పావకుడనిరి. అట్టి పావకుడను నేనే అని దైవము పలుకుచున్నాడు.

వసువులనగా వెలుగొందువారు. వారు ఎనిమిది మంది.

సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, పంచభూతములు. ఈ ఎనిమిది వర్గములయందు అత్యంత తేజస్సు గలవాడు అగ్నియే. అగ్నివలననే సమస్తము వెలుగుచు నున్నది.

4. శిఖరములలో మేరు శిఖరము నేను అని భగవంతుడు పలికినాడు. శిఖరము ప్రజ్ఞామయమగు సుడిగుండము. ఈ సుడి గుండము కారణముగ సృష్టి యందు గోళాకారము లేర్పడుచు నుండును. గోళాకారమునకు మూలము ఈ సుడిగుండమే. ఇట్టి సుడిగుండములు ధన సంజ్ఞగను, ఋణ సంజ్ఞగను ఉత్తర దక్షిణ ధృవములు ఏర్పడినవి. వాని నడుమ గోళాకార మేర్పడుచు నుండును. చోటునందు ఇట్టి సుడిగుండముల వ్యూహములే మేరువులు. ప్రతి గోళమునకు మేరువుండును. మేరువులేక గోళ మేర్పడదు. ఉత్తర ధృవము అట్టి మేరువు. చోటు నుండి పంచ భూతముల నాకర్షించి, తన చుట్టును ఒక గొడుగువలె గోళము యొక్క ఉత్తరభాగము నేర్పరచును. ధృవము యొక్క అడుగు భాగము మరియొక సుడిగుండమువలె పని చేసి, అర్ధగోళముగ నున్న భూమిని పూర్ణము చేయును. అట్టి గోళముల గుంపే సూర్య మండలములుగను, సవితృ మండలములుగను, భర్గోదేవ మండలముగను బ్రహ్మాండ మేర్పడుచున్నది. సృష్టి యంతయు ఒక మహా మహిమాన్వితమగు గ్రుడ్డుగ ఏర్పడుటకు కారణము మేరువే. అట్టి మేరువుగ నున్నది తానే అని దైవము తెలుపు చున్నాడు.

మేరువులు ప్రజ్ఞామయ సుడిగుండములే గాని భౌతికములు కావు. వానినుండి గోళము లేర్పడును. ఇందు ఉత్తర మేరువునకు వికర్షణ, దక్షిణ మేరువుకు ఆకర్షణ ఆయుధములుగ పనిచేయు చుండును. ఈ సుడిగుండముల పరిభ్రమణము మనమెరిగిన ధృవములకన్న అమితమగు ఎత్తున జరుగుచు నుండును.

(17)

## బృహస్పతి - స్కందుడు - సముద్రము

**పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్ ।**
**సేనానీనా మహం స్కంద స్సరసామస్మి సాగరః ॥ 24**

*తాత్పర్యము :* పురోహితులలో నేను బృహస్పతిని. సేనా నాయకులలో స్కందుడను. సరస్సులలో నేను సముద్రము అని తెలియుము.

*వివరణము :* 1. బుద్ధికి బృహస్పతి ప్రజ్ఞ. బుద్ధి ననుసరించిన వాడు హితమును పొందును. ఎవరియందు బుద్ధి మనస్సు నధిష్ఠించి యుండునో అట్టి వానికి సంకల్పములు హితము కలిగించునవై యుండును. అట్టివాని వాక్కులు కూడ ఇతరులకు హితవు గూర్చును. వాతావరణమును పరిశుద్ధము చేయును గూడ. ఇట్టి బుద్ధిమంతు లనేకు లుందురు. వారందరిలోను బృహస్పతి ముఖ్యుడు. బృహస్పతి దేవతలకు కూడ గురువే. అతడు ముఖ్యు డనుటలో ముఖము నుండి వ్యక్తమగు వాడని అర్థము. అనగా చక్కని సలహాదారు. దేవతలలో ముఖ్యుడగు వాసవుడు (ఇంద్రుడు) కూడ బృహస్పతిని అనుసరించిననే స్థిరముగను, సుఖముగను

ఉండగలడు. అట్టి బృహస్పతి తానే అని దైవము చెప్పుచున్నాడు. భగవత్ సంకల్పము ననుసరించే బృహస్పతి పలుకును. బృహస్పతి వాగ్రూపుడు. కనుక అతడిని బ్రహ్మణస్పతి అని పిలుతురు.

2. సేనలను నడిపించుటలో తాను స్కందుడనని దైవము పలికినాడు. స్కందుడనగా కుమారస్వామి. సుబ్రహ్మణ్యస్వామి. అతని జననము వలన సృష్టియందు అసుర ప్రవృత్తి నిర్జించ బడును. స్కందుడు షణ్ముఖుడు. అనగా ఆరు ముఖములు గలవాడు. మనయందు గూడ స్కందుడు ఆజ్ఞ నుండి మూలాధార కేంద్రము వరకు వ్యాప్తిచెంది యుండును. అతనిని దర్శించినచో మనలో మనస్సు, పంచేంద్రియములను ఆవరించియున్న అజ్ఞాన మను చీకటులు అంతరించును. మనలోని వెలుగు ప్రజ్ఞలకు బలము నిచ్చుచు, అసుర ప్రజ్ఞలను అంతము చేయుచు నుండును. ఆరాధనమున అంతర్ముఖముగ ఆజ్ఞ నుండి మూలాధారము వరకు ఒక వెలుగు దండమును దర్శించుచు నుండవలెను. ఏడవ కేంద్రమగు సహస్రారమందు బృహస్పతిని లేక బ్రహ్మణస్పతిని లేక గణపతిని దర్శించుచు నుండవలెను. ఇట్లు పరిపూర్ణముగ దైవమును సహస్రారము నుండి మూలా ధారము వరకు దర్శించుచు అందు మునిగి యుండవలెను.

బృహస్పతి బ్రహ్మ ధర్మమునకు, స్కందుడు క్షత్రియ ధర్మము నకు అధిపతులు. ఈ రెండు ధర్మములు సహస్రారము నుండి

మూలాధారము వరకు వ్యాప్తి చెంది యున్నవి. వీరిరువురిని ఒక శ్లోకమున తెలుపుటలో ఇట్టి ఔచిత్యమున్నది.

3. సరస్సులలో తాను సముద్రమని దైవము తెలిపినాడు. పరిమాణమున సముద్రమును మించిన సరస్సులేదు. శ్లోకమున సముద్రమును సాగరమని సంబోధించబడినది. సాగరమనగ సమస్త జలములకు ఆలవాలము, ఆశ్రయము. జలములనగా జీవము లని గూడ అర్థమున్నది. నారములని మరియొక పదము కూడ యున్నది. సమస్త జీవములు, జలములు, నారములకు ఆలయము సాగరము. సాగర మథనముననే సృష్టి పుట్టినది. గరళమునకు కూడ సాగరమే మూలము. అనగా జీవుల పుట్టుక యున్నచోటనే మరణముకూడ యున్నది. జీవులు పుట్టుచోటు సాగరము కాగా మరల మృత్యువునకు చేరుచోటు కూడ సాగరమే.

*"ఎచ్చట పుట్టె నచ్చటికి ఏగుట నైజము ప్రాణి కోటికిన్"* అని భాగవతము పలుకుచున్నది.

*"పుట్టినచోటికె పొరలి పొరలివచ్చి"* అని అన్నమాచార్యుల వారు పలికినారు. మహాలక్ష్మితో సహా సమస్తము పుట్టుచోటు, మరల తిరిగి వచ్చి చేరుచోటు సాగరము. అది నేనే అని దైవము పలుకు చున్నాడు.

(18)

## భృగువు - ఏకాక్షరము - జపయజ్ఞము - హిమాలయము

**మహర్షీణాం భృగు రహం గిరామ స్మ్యేకమక్షరమ్ ।**
**యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి స్థావరాణాం హిమాలయః ॥ 25**

*తాత్పర్యము :* మహర్షులలో నేను భృగువును. వాక్కులలో నేను ఏకాక్షరమును. యజ్ఞములలో జప యజ్ఞమును. స్థిరమగు వాటిలో నేను హిమాలయమును అయి ఉన్నాను.

*వివరణము :* 1. ఋషి అనగా చూచువాడు. మహర్షి యనగా మహత్తును సైతము చూచువాడు. చూచుటకు కనులు ప్రధానము. సూక్ష్మమగు విషయములు చూచుటకు, మహత్తును చూచుటకు మూడవ కన్ను ప్రధానము. ఇట్లు మూడు కన్నులతో స్థూల, సూక్ష్మ, కారణ, మహత్తులను చూచుట భృగుమహర్షి నిర్వర్తించును. యోగమందలి ఏడవ అంగమైన ధ్యానము భ్రూమధ్యము నందు చేయుట యోగసాధకులు నిర్వర్తింతురు. ధ్యానము సిద్ధించినపుడు తమ యందలి మూడవ కన్ను కూడ చూచుట యుండును.

ప్రజాపతులందరు తన విభూతియే అని ముందు శ్లోకమున తెలిపిన భగవంతుడు భృగువును మరల తానుగ ఉదహరించినాడు.

చూచుట అను ప్రక్రియ అత్యంత ప్రధానమగు ప్రక్రియ అగుటచే ఆజ్ఞా కేంద్రమును అధిష్ఠించియున్న భృగువును పేర్కొనినాడు. అత్రి మహర్షి సహస్రారమునకు, భృగు మహర్షి ఆజ్ఞకు, అంగీరస మహర్షి విశుద్ధి కేంద్రమునకు, వశిష్ఠ మహర్షి హృదయ కేంద్రము నకు, పులస్త్య మహర్షి మణిపూరకమునకు, పులహ మహర్షి స్వాధిష్ఠానమునకు, క్రతు మహర్షి మూలాధార కేంద్రమునకు అధిపతులుగ పురాణములు తెలుపుచున్నవి. ముందు సమస్త దర్శన జ్ఞానమునకు కేంద్రముగ యున్న ఆజ్ఞను పరిపాలించు భృగు మహర్షి తానే అని పలికినాడు.

భృగు మహర్షి నుండియే తెల్లని కిరణముగ శుక్రాచార్యుడు ఉద్భవించెను. అతనిని భార్గవుడందురు. భృగు మహర్షి నుండియే అతి నిర్మలము, అమలము, స్వచ్ఛము అగు లక్ష్మీదేవి ఉద్భవించి నది. ఆమెను భార్గవి అందురు. సృష్టి ధర్మములను నిర్వర్తించు టలో భృగువు అత్యంత కీలకమగు పాత్ర వహించు చున్నాడు. కన్నుల నుండి వెలుగు పుట్టి, ఆ వెలుగు ఏడు రంగులుగను, మనస్సున ఏడు ప్రజ్ఞలుగను, బుద్ధియందు ఏడు శాస్త్రములుగను దర్శనమగు చున్నవి. శరీరమున శుక్రధాతువు భృగు మహర్షి ప్రసాదముగనే వ్యక్తమై జీవులకు దేహమును కల్పించుట నిర్వర్తింప బడుచున్నది. భృగుమహర్షి మహిమ పురాణము లందు విస్తారమై యున్నది.

2. వాక్కునకు అక్షరములు ప్రధానము. అక్షరములకు మూలము ఏకాక్షరమగు ప్రణవము. ప్రణవ నాదము నుండియే

అన్ని అక్షరములు ఉద్భవించు చున్నవి. అక్షరములు అమృత మయములు, అక్షయములు కూడ. ఎంత వాడినను మరల మరల వాడుటకు అందుబాటులో నుండును. అట్టి శాశ్వతమగు అక్షరములకు మూలము ప్రణవ నాదము. అట్టి ప్రణవముగ నేనే యున్నాను అని దైవము పలుకుచున్నాడు. ప్రణవమే బ్రహ్మమని వేదములు ఘోషించుచు నున్నవి. ఛందోబద్ధముగ అక్షరములను ఉచ్చరించి వినువాని మనసు చక్కగ సంస్కరింప బడును. సుశబ్దములు పలుకుచు వినుటవలన నిర్మల హృదయ మును చేరిన మానవ ప్రజ్ఞ దివ్యత్వమును అనుభవించదగును. ప్రణవ నాదము ననుసరించి, ఉపాసించి దాని అవతరణ మార్గమున పయనించు జీవునకు తానక్షరుడని, పరమగు బ్రహ్మ మని కూడ తెలియనగును.

3. స్థావరములలో తాను హిమాలయము. హిమాలయ మనగా మంచు ఏర్పడు ప్రదేశములు. భారతదేశమునకు ఉత్తర ముగ నున్న పర్వతములను కూడ హిమాలయములని సంబో ధింతురు. కాని భూమిపై హిమము ఏర్పడు ప్రదేశము లనేకములు గలవు. అవి యన్నియు నిజమునకు హిమమునకు ఆశ్రయములే, ఆలయములే. ప్రత్యేకించి ఉత్తర దక్షిణ ధృవములు చోటులో నుండి నీటిని గ్రహించి, సుడిగుండముల రూపమున ధృవము లందు అమితముగ హిమమును చేర్చును. ఈ హిమము నుండి క్రమముగ స్థిరమగు గోళ మేర్పడి కోటానుకోట్ల జీవులకు స్థావరమై యున్నది. స్థిరమగు భూమి ఆధారముగనే జీవులు భూమిపై దేహ

ములు ధరించి జీవించు చున్నారు. అట్టి భూమికి మూలమగు ధృవము లందలి మంచు ఆధారమై యున్నది. నీరు మంచుగడ్డగ నేర్పడి, మంచుగడ్డ ఘనమై, స్థిరమగు స్థావరములను ఏర్పరచుచు నుండును. ఈ స్థావరములు ఆవాసములై జీవకోటి పరిణతి చెందుచున్నది. ఈ స్థావరముల మూలము తానేయని దైవము పలుకుచున్నాడు.

4. యజ్ఞములలో జపయజ్ఞము నేను. యజ్ఞ మనగా శ్రేయస్సును కూర్చు కార్యము. జీవ శ్రేయస్సుకు తోడ్పడునది ఏదైనను యజ్ఞము. అట్టి యజ్ఞములలో జపయజ్ఞము అత్యుత్తమము. శ్రద్ధాభక్తులతో నిత్యము మనసున దైవ నామమును స్మరించుట జపయజ్ఞము. ఇట్టి యజ్ఞము నిర్వర్తించు వానికి లోన అంతఃకరణశుద్ధి ఏర్పడి పవిత్రుడగుట వలన దైవదర్శనము, ఆత్మ దర్శనము లభించును. అంతేగాక నామస్మరణము నుండి పుట్టిన తరంగములు పరిసర వాతావరణమును కూడ పవిత్రీకరించును. కాలుష్యము నివారించబడును. ముని సంఘములు వనములలో చేయు అంతరంగ జపయజ్ఞముల వలన పుణ్య క్షేత్రములు గూడ ఏర్పడినవి. అతి సులభము, అమిత సౌకర్యము జపయజ్ఞము. దానిని నిర్వర్తించుకొను వానికి దైవము ప్రీతితో సాన్నిధ్యము నిచ్చును. ఇతర యజ్ఞముల కన్న జపయజ్ఞమే శ్రేష్ఠమని తెలుపుటకు, యజ్ఞములలో జపయజ్ఞము తానని దైవము పలికి నాడు.

(19)

## అశ్వత్థము - నారదుడు - చిత్రరథుడు - కపిలుడు

అశ్వత్థః సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః ।
గంధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః ॥ 26

*తాత్పర్యము :* వృక్షములలో నేను అశ్వత్థమును. దేవర్షులలో నేను నారదుడను. గంధర్వులలో నేను చిత్రరథుడను. సిద్ధులలో నేను కపిలుడను.

*వివరణము :* మరియొక నాలుగు విభూతులు దైవము తెలిపినాడు. అవి వరుసగా అశ్వత్థము, నారద మహర్షి, చిత్ర రథుడు, కపిలుడు.

**1. అశ్వత్థము :** అశ్వత్థ వృక్షమనగా రావిచెట్టు. అశ్వము లనగా ప్రాణములు. ప్రాణములను స్థిరముగ ధరించి, పరిసరములకు ప్రసరింపజేయు వృక్షములలో అశ్వత్థమును మించినది లేదు. అశ్వత్థ వృక్షము క్రింద తపస్సు చేసుకొను మునులెందరో కలరు. సిద్ధి పొందినవారు కలరు. అనగా బ్రహ్మజ్ఞానము పొందినవారు గలరు. ప్రాణములు ఊర్ధ్వము నుండి అధస్సునకు, అధస్సు నుండి ఊర్ధ్వమునకు నిత్యము ప్రవహించుచు నుండును. కనుక ఈ

వృక్షము క్రింద తపస్సు చేయువారికి ప్రజ్ఞ సూక్ష్మతత్త్వములోనికి ఉద్ధరింపబడి, ఆత్మజ్ఞానము సిద్ధించుటకు అవకాశము మెండు. ఈ వృక్షమునందు బృహస్పతి గ్రహము యొక్క తత్త్వము ఎక్కువగా ఇమిడి యున్నట్లు జ్యోతిర్విద్య తెలుపును. అందువలన ఈ వృక్ష ఛాయయందు తపస్సు చేసుకొను వారికి ప్రజ్ఞా వికాసము శీఘ్రముగ కలుగ గలదు.

రావి చెట్టు ఛాయయందుండుట, రావివేరు నానబెట్టిన నీరు త్రాగుట, రావి పండ్లు తినుట, రావి ఆకులను కూడ తినుట వేద సంప్రదాయమున యున్నది. సర్వ విద్యల ఉపాసనకు రావి సహకారము ఎంతయో ఉపయోగకరము. అంతేగాక రావిపుల్ల లను హోమ ద్రవ్యములలో చేర్చి, సమిధలుగ వినియోగించుట కూడ అగ్నిహోత్రములందు చూడవచ్చును. విష్ణు ప్రీతి యని భావించి, రావిని అనేక విధములుగ శిష్టాచారులు వినియోగించు చుందురు. మన దేహమందలి ప్రాణమయ కోశమునకు రావి స్పర్శ చాల బలము కూర్చును. ప్రాణమయకోశము అశ్వమువలే ఉత్సాహముగ నుండుట వలన బ్రహ్మ ముహూర్తమున అనా యాసముగ నిద్రనుండియే మేల్కాంచుట సంభవించును. రావి చెట్టును హయగ్రీవమూర్తిగ, సకల విద్యాధి దేవతగ భావించి పూజించుట, ప్రదక్షణలు చేయుట నేటికిని జరుగుచు నున్నది. రావిచెట్టు కనబడగనే హృదయ పూర్వకముగ నమస్కరించుట ఒక చక్కని సంస్కారము.

**2. నారదుడు** : బ్రహ్మ సృష్టి యందు ముందుగ వెలువడిన వారు సనక సనందనాది నలుగురు మానస పుత్రులు. వారు దేవర్షులు. అటుపైన ప్రజాపతులతో వ్యక్తమైనవాడు నారద మహర్షి. నారద మహర్షియే మానస పుత్రులకుగాని, ప్రజాపతులకు గాని, మనువులకు గాని చక్కని మార్గదర్శి. సురాసురులకు కూడ అతడే మార్గదర్శి. అన్ని విధముల పరిపూర్ణమగు యోగి. అత్యంత వాత్సల్యముతో సంచరించు మిత్రుడు. ప్రహ్లాదునకు గాని, ధృవు నకుగాని, వాల్మీకి మహర్షికిగాని, వేదవ్యాస మహర్షికిగాని మార్గ దర్శకత్వము వహించినవాడు. సనక సనందనాదులు దైవము యొక్క చతుర్వ్యూహములలో అధిష్ఠించి పనిచేయుచున్ననూ, ఆ వ్యూహములలో చిక్కుకొని యుండక నిర్వర్తించెడు యుక్తి తెలిసిన వాడతడు. నారాయణుని యొక్క వ్యూహములను తెలిసి, తదనుగుణముగ 14 లోకములలోను సంచరించు మహా మహిమా న్వితుడు. అట్టి నారద మహర్షి తానే యని దైవము తనయొక్క మరియొక విభూతిని ప్రకటించినాడు.

**3. చిత్రరథుడు** : చిత్రరథుడు దేవగంధర్వుడు. కశ్యప మహర్షి కుమారుడు. అనేకానేకమగు దివ్యాస్త్రములను తన తపఃశక్తిచే పొందినను అతడెన్నడును తన్నుతాను ప్రశంసించుకొన్న వాడు కాదు. ఎవరిని ఎన్నడును సహాయము నర్థించినవాడు కాదు. చిత్రరథుని సహాయ సహకారములు అర్జుననకు చిత్రరథుడే పరోక్షముగా ప్రసాదించెను. పదునెనిమిది రోజులు జరిగిన మహా భారత యుద్ధము గూర్చి, అందు కలిగిన విజయములను గూర్చి

అర్జునుడు పలుకుచుండగ, శ్రీకృష్ణుడు అర్జునునితో ఇట్లనెను. "ఇదే యుద్ధము చిత్రరథుడు నిర్వర్తించినచో ఐదు రోజులలో ముగించెడివాడు." చిత్రరథుని ఔన్నత్యము కృష్ణునికి మాత్రమే తెలుసు. నిజమునకు దేవ గంధర్వులలో చిత్రరథుడు తానే గదా! చిత్రరథుడు విద్యాధరులకు, కిన్నరులకు, గంధర్వులకు కూడ పూజనీయుడు, ఆరాధ్యుడు. కశ్యపమహర్షికి "ముని" అనెడి భార్య వలన కలిగిన సంతానమితడు.

**4. కపిలుడు** : మన భూమిపై భగవంతుని ప్రథమ అవతారము కపిలుడు. కర్దమ ప్రజాపతికి, దేవహూతికి ఏకైక పుత్ర సంతానముగ అవతరించినవాడు. దేవహూతి దేవికి భక్తి, జ్ఞాన, యోగ, వైరాగ్యములను సుస్పష్టముగ బోధించినవాడు. భగవంతుని యొక్క 'సిద్ధ' అవతారము కపిల మహర్షి. భక్తి జ్ఞాన యోగ వైరాగ్యముల పేరన సాంఖ్యజ్ఞానమును భూమిపై ఆవిష్కరించిన వాడతడు. జీవుల యందు మూలాధారమున వసించుచు, సంఖ్యా జ్ఞానమును అందించు శాశ్వతమూర్తి. హరి అవతారము. కనుకనే దైవము "సిద్ధులలో నేను కపిలుడను" అని పలికినాడు.

20

## ఉచ్చైశ్రవసము - ఐరావతము - నరాధిపుడు

**ఉచ్చైశ్శ్రవస మశ్వానాం విద్ధి మామృతోద్భవమ్ ।**
**ఐరావతం గజేంద్రాణాం నరాణాం చ నరాధిపమ్ ॥ 27**

*తాత్పర్యము :* గుఱ్ఱములలో నేను ఉచ్చైశ్రవసమును. గజేంద్రులలో నేను ఐరావతమును. నరులలో నరాధిపుడను.

*వివరణము :* ఉచ్చైశ్రవసము, ఐరావతము అమృతోద్భవ సమయమున జనించినవి.

**1. ఉచ్చైశ్రవసము :** శ్రవసము అనగా శ్రవణము చేయుట. అనగా వినుట. ఉచ్చైశ్రవసము అనగా శ్రద్ధగ, సంపూర్ణముగ వినుట. నిక్కిన చెవులు గల గుఱ్ఱమని ఈ పదము యొక్క అర్థము. మాటాడుటకన్న వినగలుగుట ఉత్తమగుణము. వినుట యందు గూడ పూర్ణముగ వినుట, పూర్ణముగ విషయమును సంగ్రహించుట మరింత ఉత్తమగుణము. చక్కని శ్రవణ శక్తి గలవాడే నిజముగ గ్రహణశక్తి కలిగినవాడు. పంచభూతములకు మూలమాకాశము. ఆకాశము శబ్దగుణము గలది. శబ్దములు రెండు రకములుగ

నుండును. 1. ఆహత శబ్దము. 2. అనాహత శబ్దము. చక్కని నిక్కిన చెవులు గలవారు ఆహత శబ్దమును, అనాహత శబ్దమును వినగలరు. ఆకాశవాణి అనాహత శబ్దముగనే వినిపించును. అట్టి అనాహత శబ్దమును వినుట వలన కాలము, దేశము ననుసరించి గ్రహింపవలసిన విషయము ముందుగానే తెలియును. ఇట్టి గుణముగ సృష్టియందు నేనే యున్నాను అని దైవము పలికినాడు.

ఉచ్చైశ్రవసము దేవేంద్రుని వద్ద ఉంచబడినది. కాని నిజమునకా గుణము దేవగురువగు బృహస్పతియందే నిత్యము గను, శాశ్వతముగను యున్నది. బ్రహ్మర్షులు, మహర్షులు, రాజర్షులు, ఋషులు, సిద్ధులు, మునులు ఇట్టివారి త్రికాల జ్ఞాన మంతయు వారియందు ఉచ్చైశ్రవసముగ దైవముండుటయే. శ్రీకృష్ణుని చరితమందు అతడు రుచి చూపించిన త్రికాల జ్ఞాన మంతయు ఈ గుణమే. దైవము శబ్దస్వరూపుడు. అట్టి శబ్దము ప్రాణమును ఆశ్రయించి వర్తించుట వలన గుఱ్ఱముగ తెలుపుదురు.

**2. ఐరావతము** : వర్షించు మేఘములలో మెఱపువలె కనిపించి, పిడుగువలె శబ్దము చేయు శక్తిని ఐరావతమందురు. జలగర్భితములై ఆకాశమున బరువుగ కదులు నల్లని మేఘముల గుంపు అసురశక్తివలె గోచరించును. అట్టి మేఘములు సూర్య కిరణములను కూడ అడ్డగించును. కనుకనే వానిని సురకాంతిని నిర్జించు అసుర రూపములుగ తెలుపుదురు. వానిని ఛేదించుటకు

ఉఱుములు, మెఱపులు ఏర్పడి వర్షము కురియును. అనంత రము మేఘములు తేలికయై, తెల్లని స్వచ్ఛమైన దూది పింజముల వలె చూపరులకు గోచరించును. అసురశక్తి వీడగ సురలు ప్రకాశించునట్లు, నల్లని మేఘములు వర్షానంతరము తెల్లవిగ గోచరించి ఆనందము కలిగించును. అట్లేర్పడుటకు ఉఱుములు, మెఱపులే కారణము. ఉఱుములు, మెఱపుల రూపమున విద్యు తాగ్ని పనిచేయును. ఈ అగ్నినే ఐరావతమందురు. ఉఱుములు, మెఱపులు కలిగినపుడెల్ల ఐరావతముపై ఇంద్రుడు సంచరించు చున్నాడని భారతీయులు భావింతురు. ఐరావతము కారణముగనే ఇంద్రునికి 'మేఘాధిపతి' అను కీర్తి కలిగెను. ఆధునిక యుగమున ఈ ఐరావతమునే మానవులు విద్యుతాగ్ని రూపమున అనేక సౌకర్యము లేర్పరచుకొను చున్నారు. అమిత శక్తివంతమైన విద్యు తాగ్నియే ఐరావతమని తెలిసి హెచ్చరికగ దానిని వినియోగించు కొనవలెను. ఐరావతము ఎదురులేని శక్తి. ఆకాశమునందే విహ రించుచు నుండును. అట్టి విద్యుత్ శక్తి నేనే అని దైవము పలికి నాడు.

**3. నరాధిపుడు :** నరాధిపుడనగా రాజు అని సామాన్యార్థము. నిజమునకు అధికమగు మేధో సంపత్తి కలవాడే అధికుడు. వారి రూపమున నేనే యున్నాను అని దైవము పలుకుచున్నాడు. నరు లలో అధికుడైనవాడు ఇతరులను పరిపాలించుచు నుండును.

ఇతరులు అతని పాలనమును స్వచ్ఛందముగ స్వీకరింతురు. అట్టి నరాధిపుడు తన పాలనములోనికి ప్రవేశించిన వారందరికిని ఆశ్రయుడగును. ప్రజలు తమకు తాముగ ఎవ్వరి నాశ్రయింతురో అట్టివారు ఆశ్రయించినవారి యోగక్షేమముల బాధ్యత స్వీకరించ వలెను. తండ్రివలె ప్రేమతో ఆశ్రయమిచ్చువాడే నిజమగు నరాధిపుడు. లోకమున గోపాలుడుగను, గొఱ్ఱెల కాపరిగను ప్రేమతో ఆశ్రయమిచ్చిన శ్రీకృష్ణుడు, ఏసుక్రీస్తు, బుద్ధుడు నిజమగు నరాధిపులు. వారి రూపమున నున్నది తానే అని దైవము పలుకుచున్నాడు. సద్గురువు లందరును అట్టివారే.

(21)

## వజ్రాయుధము - కామధేనువు - కామదేవుడు - వాసుకి

**ఆయుధానా మహం వజ్రం ధేనూనా మస్మి కామధుక్ ।**
**ప్రజనశ్చాస్మి కందర్పః సర్పాణా మస్మి వాసుకిః ॥ 28**

*తాత్పర్యము :* ఆయుధములలో నేను వజ్రాయుధమును. పవిత్రమగు గోవులలో నేను కామధేనువును. ప్రజోత్పత్తి ప్రజ్ఞలలో నేను కామదేవుడను. సర్పములలో నేను వాసుకిని.

*వివరణము :* **1. వజ్రాయుధము** : సుదర్శన చక్రము, త్రిశూలము, సారంగి, పినాకి ఆయుధములవంటి దివ్యాయుధములను శివకేశవులు ధరించి యున్నారు. పినాకము శివుని ధనుస్సు కాగా, సారంగము విష్ణు ధనుస్సయి ఉన్నది. త్రిశూలము శివుని ముఖ్య ఆయుధము కాగా, సుదర్శనము మహావిష్ణువు ప్రధాన ఆయుధముగ నున్నవి. ఇవి ఏవియు కాక ప్రధాన ఆయుధములుగ దైవము పలుకలేదు. వజ్రాయుధము తానని పలికినాడు. దైవము భక్తవత్సలుడు. తనకన్న తన భక్తుల యందాసక్తి మెండుగా గలవాడు. తాము ధరించిన ఆయుధములు తమ తపఃసంపత్తికి చిహ్నములు. వాటికి సమానమగు ఆయుధములు లేవు. కాని

తమ తపస్సుకన్న దధీచి మహర్షి ఒనర్చిన తపస్సునకు, త్యాగము నకు దైవము విలువ ఎక్కువగ ప్రకటించినాడు. తమ తపస్సు నుండి తమకు లభించిన ఆయుధములు తమ వద్దే యున్నవి. కాని దధీచి మహర్షి చేసిన అనన్య సామాన్యమగు తపస్సు వలన ఏర్పడిన శక్తి ఆ మహర్షియొక్క వెన్ను ఎముకగ యుండెడిది. లోక శ్రేయస్సు కొరకు ఆ వెన్ను దండమును ఇంద్రుడు కోరగా, దధీచి మహర్షి తన ఉనికిని లెక్కచేయక, తన వెన్ను దండమును ఇంద్రున కిచ్చెను. అట్టి తపస్సు, త్యాగము నిరుపమానము. వజ్రము వలన వృత్రాసుర సంహారము జరిగినది. సృష్టి పరిమితత్వ మును దాటించగల ఆయుధము వజ్రాయుధము. వృత్రచ్ఛేదనము జరుగుచున్నకొలది జీవప్రజ్ఞ పరిమితులను దాటి, అపరిమిత తత్త్వములోనికి వ్యాప్తి చెందుచు నుండును. అట్లు జీవోద్ధారణము గావించు ఆయుధముగ దైవమునకు అత్యంత ప్రీతికరమగు ఆయుధమై వజ్రము నిలచినది.

**2. కామధేనువు** : ధేనువనగా క్షీరము లిచ్చి పోషించునది అని అర్థము. కామపూరణము అను పాలను యిచ్చునది కామ ధేనువు. అనగా సృష్టి సంపదలన్నింటిని ప్రసాదించు గోవు అని అర్థము. కామధేనువునకు పుష్టికరమగు దేహము, పక్షి రెక్కల వంటి రెక్కలు, తెల్లని స్వచ్ఛమైన మేఘము వంటి వర్ణము, అంద మైనటువంటి తోక, పుష్టికరమైనటువంటి పొదుగు ఋషులు చిత్రీకరించిరి. కామధేనువు ముఖము నుండి తోక వరకు అంగము లన్ని వ్యాపించి, సమస్తదేవతలు యిమిడి యున్నట్లుగ వర్ణింతురు.

కామధేనువును సురభి అని, గోమాతయని సంబోధింతురు. క్షీర సాగర మథనమున పుట్టిన దివ్య అంశములలో కామధేను వొకటి. జీవుడు సృష్టియందు కామపరిపూర్ణము ద్వారానే పరితుష్టి చెంది, మోక్షకామి యగుచున్నాడు. కోరికలు మిగిలి యుండగ ఎవరూ పరిపూర్ణులు కాలేరు. దైవము కామధేనువు రూపమున తానే జీవులకు ధర్మ మార్గమున కామతృప్తి కలిగించి మోక్షమునకు మార్గము చూపుచున్నానని తెలియజేయు చున్నాడు.

సనాతన ధర్మ సంప్రదాయమున గోసహితుడగు శ్రీకృష్ణుని ఆరాధనము, దత్తాత్రేయుని ఆరాధనము గోచరించును. వైభవోపేత ముగ భక్తుల జీవితములను మలచి, అన్ని విధములుగ అతనిని పరితృప్తి గావించి, పిమ్మట తనవద్దకు చేర్చుకొనుట భగవద్విభూతి. కనుక దైవారాధనము కామధేను ఆరాధనము అయి కూడ వున్నది.

**3. కామదేవుడు** : దైవము కామేశ్వర, కామేశ్వరి రూపము. జీవసృష్టి కొరకై వారు ఈ రూపములను దాల్తురు. ఒకే తత్త్వము స్త్రీ, పురుష తత్త్వముగ ఏర్పడి ఒకదానియందొకటి సహజమగు ఆకర్షణ యుండుటచే, ఒకరినుండి మరియొకరికి ఏర్పడు ఇష్టత రూపమున కామప్రజ్ఞ ఏర్పడినది. ఈ కామప్రజ్ఞ ఆధారముగ జీవోత్పత్తి వీలుపడినది. అనేకానేక కోట్ల జీవులు ఏర్పడుటకు మూలకారణము పరస్పర ఆకర్షణ, ఇష్టతయే. స్త్రీ పురుష తత్త్వముల నడుమ ఇట్టి ఆకర్షణ యుండుట వలననే సురాసురులు, ఋషులు, మానవులు, జంతువులు, పక్షులు, వృక్షములు ఇత్యాదివన్నియు

అనంతముగ ఉత్పత్తి యగుచున్నవి. కీటకముల నుండి గంధర్వుల వరకు అన్ని లోకముల యందు ఇట్టి పరస్పర ఆకర్షణమునకు కారణము వారి సహజమగు ఏకత్వమే. కణముల నుండి బ్రహ్మాండము వరకు నిలచి యుండుటకు కారణము అందలి ధన, ఋణ సంజ్ఞల పరస్పర ఆకర్షణ. ఇట్టి ఆకర్షణ రూపమున అన్ని లోకముల యందు జీవోత్పత్తి గావించు చున్నవారు కామేశ్వరి, కామేశ్వరులే. ఈ లక్షణము యొక్క వ్యక్తరూపమే కందర్పుడు లేక కామరూపుడు. కామనిర్వహణము ధర్మయుక్తముగ నున్నపుడు దివ్యానుభవము, ధర్మవ్యతిరిక్తముగ నున్నపుడు పతనము జీవులకు కలుగుచుండును.

**4. వాసుకి** : సర్పములలో నేను వాసుకిని అని తెలిపిన దైవము తరువాతి శ్లోకములో నాగములలో నేను అనంతుడను అని పలికి నాడు. సర్పములు వేరు, నాగములు వేరు. సాగిపోవుచున్న కాలము సర్పము. దాగియున్న కాలము నాగము. ఈ వ్యత్యాసము తెలియ వలెను. సాగిపోవుచున్న కాలము అహోరాత్రములుగను, శుక్ల కృష్ణ పక్షములుగను, ఉత్తర దక్షిణ అయనములుగను, ఉచ్ఛ్వాస నిశ్వాసలుగను గోచరించును. ఇట్టి కాలములందు వచ్చిపోవు సంఘటనలన్ని పాము కుబుసముగ భావింపబడును. కథ లన్నియు కంచికి చేరునవియే అను నానుడి సుప్రసిద్ధము. అన్నీ వచ్చిపోయే సంఘటనలే. ఇట్లు గోచరించు కాలమున అధిష్ఠాన దేవత వాసుకి. అనగా జీవుడు వసించుచున్న వర్తమానకాలము.

వాసుకి కుబుసముల నెప్పటికప్పుడు వదిలివేయుచు శాశ్వతుడుగ వసించి యున్నాడు. మనము కూడ వచ్చి పోవు సంఘటనలతో ముడిపడక, వసించి యుండుట నేర్వవలెను. అట్లు నేర్చిన వాడగు వాసుకి శాశ్వత శివసాన్నిధ్యమున నున్నాడు. శివాభరణమై యున్నాడు. తానే శివునికాభరణము అని తెలుపుచున్నాడు.

యోగీశ్వరులు జరుగుచున్న కాలమున తమ కర్తవ్యములు నిర్వర్తించుచు వసింతురే కాని, "క్రిందుమీదులు" కారు. కృష్ణుడట్టివాడే. సమస్త సృష్టి భారమును వహించుచు తాను, తానుగనే యున్నాడు. కనుకనే వాసుదేవుడైనాడు. స్థితప్రజ్ఞుడై స్థిరముగ వసించి యుండుట వాసుదేవ తత్త్వము లేక వాసుకి తత్త్వము. అట్టి స్థితిని చేరుమని అర్జునునకు సున్నితముగ బోధించుచున్నాడు.

(22)

## అనంతుడు - వరుణుడు - అర్యముడు - యముడు

**అనంత శ్చాస్మి నాగానాం వరుణో యాదసా మహమ్ ।**
**పితౄణా మర్యమా చాస్మి యమ స్సంయమతా మహమ్ ॥ 29**

తాత్పర్యము : నాగులలో నేను అనంతుడను. జలదేవతలలో నేను వరుణుడను. పితృదేవతలలో నేను అర్యముడను. నియ మించు వారిలో యముడను అయి ఉన్నాను.

వివరణము : **1. అనంతుడు :** కదలుచున్నట్లు కనపడక, కదిలెడిది. న అగము, నాగము. 'గ' అనగ కదలుట. 'అగ' అనగా కదలకుండుట. 'నా అగ' అనగా కదలకుండుట కానిది.

భూమి కదలుచున్నట్లు కనపడదు. కాని కదలుచున్నది. వృక్షములు పెరుగుచున్నవి. కాని పెరుగుచున్నట్లు కనబడవు. బీజములు మెలకెత్తుచున్నపుడు కనపడవు. మెలకెత్తిన పిదప కనబడును. కాలము చేయు మార్పు లన్నియు ఇట్లే యుండును. కనపడక కదలునదియే కాలము. అది అనంతమగుట వలన అనంతుడనిరి. కాలమే సృష్టి ఉద్భవమునకు, వృద్ధికి, తిరో

గమనమునకు, లయమునకు మూలమై యున్నది. చివరకు మిగులునది కాలమే. కనుకనే అనంతమగు కాలమును శేషుడని కూడ పిలువబడు చున్నాడు. ఏమియు లేనపుడుకూడ కాల మున్నది.

2. **వరుణుడు** : సృష్టియందు జలమే జీవము. కదలిక జలముల లక్షణము. కనుక జీవ లక్షణము కూడ. అందలి వరుణుడు అగ్నిగ, మొలకెత్తించు శక్తిగ పనిచేయు చున్నాడు. వరుణు డాధారముగనే జలములు జీవరూపము ధరించుచున్నవి. జీవరూపములు ధరించినపుడు జలముండదు. ప్రవాహస్థితిగ పనిచేయును. ఈ ప్రవాహ శక్తి వరుణశక్తి. వరుణుడు అమితమగు బలము కలవాడు. వరుణబంధము చేతనే సృష్టియందు జీవులు రూపములందు బంధింపబడి యున్నారు.

3. **అర్యముడు** : అర్యముడు ద్వాదశ ఆదిత్యులలో ఒకడు. ఇతడు వైశాఖ మాసమున కధిపతి. పితృలోకములకు కూడ అధిపతి ఇతడే. మరణించిన వెనుక, పునర్జన్మించు లోపల జీవులు అర్యమ ప్రజ్ఞయందు విశ్రాంతి గొనుదురు. పితృదేవతలలో అధికు డగుటచే ఇతనిని తర్పణములతో సేవింతురు. జీవుల యందు ఉచ్ఛ్వాస నిశ్వాసముల నడుమ వర్తించునది కూడ అర్యముడే. అదితి - కశ్యపుల మూడవ సంతాన మితడు. సృష్టి యందు విరామమున కధిపతిగ నుండును. రెండు పరస్పర విరుద్ధమగు

శక్తుల నడుమ సంధి కుదుర్చువా డర్యముడు. ప్రాణాపానముల నడుమ, మిత్రా-వరుణుల నడుమ, అహోరాత్రుల నడుమ ఇతడు జీవులకు విరామము నిచ్చి ఉజ్జీవము గావించును. త్రిమూర్తులలో మధ్యస్థుడగు విష్ణువితడే. సృష్టి లయముల నడుమ యుండెడి స్థితి ఇతడే. కనుకనే నేను అర్యముడను అని శ్రీకృష్ణుడు పలికినాడు.

**4. యముడు** : సృష్టి నిర్మాణము, నిర్వహణము, సృష్టి తిరోధానము, లయము అన్నియు నియమబద్ధములే. కాలము రూపమున సృష్టి, సృష్టిజీవులు యమింపబడుచున్నారు. అతిక్రమించి ఎవరును వర్తించలేరు. సృష్టి యమముగ పనిచేయుచున్న యమదేవుడు తానే అని శ్రీకృష్ణుడు బోధించుచున్నాడు. సృష్టి యందన్నిటికిని మితి యున్నది. దైవమొక్కడే అమితుడు. ఇట్టి మితత్వమును నిర్దేశించి పాలించుటవలన యమస్వరూపుడై దైవమున్నాడని తెలియవలెను. సృష్టిలో ఏదియును తన మితిని దాటి పనిచేసినపుడెల్ల మిత మేర్పరచి నడిపించు దైవీతత్వమునే యముడని తెలిపెను. కాలము రూపమున యముడు వర్తించుచునుండును.

23

## ప్రహ్లాదుడు - కాలము - సింహము - గరుత్మంతుడు

**ప్రహ్లాద శ్చాస్మి దైత్యానాం కాలః కలయతా మహమ్ ।
మృగాణాం చ మృగేంద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్॥30**

*తాత్పర్యము :* దైత్యులలో నేను ప్రహ్లాదుడను. కాలము రూపమున సమస్తమును లెక్కించువాడను. మృగములలో నేను సింహమును. పక్షులలో నేను గరుత్మంతుడను.

*వివరణము :* **1. ప్రహ్లాదుడు** : దైత్యులలో ప్రహ్లాదుడు ప్రత్యేకము. దైత్యులనగా దితి సంతతి. దితి అనగా చీకటి. అదితి అనగా వెలుగు. చీకటి అనగా విజృంభించిన రజః తమస్సులు. అదితి అనగా సత్వగుణము ప్రధానముగా కలవాడు. దితి సంతతి రజః తమస్సు లనెడి అసుర గుణములకు లోనై అలజడితో నుందురు. ఆటుపోట్లు అధికముగ నుండును. ఆనందము క్షణిక ముగ నుండును. కార్యములందు విపరీత ధోరణి ఉండును. అహంకార మధికమై జ్ఞానము నశించి యుండును. ధర్మవ్యతిరిక్తత యుండును. ఇట్టి దితి సంతానమున ప్రహ్లాదు డుద్భవించినాడు. ప్రహ్లాదుడు ఆనందమునకు పరాకాష్ఠ. అతనియందు దైవము, ధర్మము, సత్వగుణ సంపత్తి నారదోపదేశము వలన ఏర్పడినవి.

ఎట్టి దురాచారములకు లోనైనను, ఒక చిన్న ధర్మమును అవలంబించు వానిని నేనే ఉద్ధరించుకొని నా సాన్నిధ్యమున స్థిర పరతునని భగవద్గీతయందు శ్రీకృష్ణుని వాగ్దానమున్నది. అసుర జాతి లక్షణముతో పుట్టినను, చిన్నతనముననే ధర్మస్పర్శ కలుగుటచే ప్రహ్లాదుడు సమస్తమునందు దైవమును, ధర్మమును దర్శించిన వాడాయెను. దైవమతనియందు శాశ్వత సాన్నిధ్యము ప్రసాదించెను. తత్కారణముగ ఆహ్లాదమునకు పరాకాష్ఠయై నిలచెను. దైత్యులలో ప్రహ్లాదుడు తన విభూతి అని ప్రకటించినాడు.

**2. కాలము** : సృష్టియందు దైవము కాలమై స్వామిత్వమును వహించును. కాలమే అన్నియు చేయుచుండును. కాలమెవ్వరికిని అంతుపట్టదు. జీవులు కలియుట, విడిపోవుట కూడ కాలము వలననే. కర్మఫలములను గూడ జీవులందరికిని కాలమే అనుగ్రహించు చుండును. కాలపు మడతలలో ఏమున్నదో పూర్ణముగ తొంగిచూచువారు ఎవ్వరును లేరు. దైవమువలె కాలముగూడ దాటరానిది. కాలము నిర్వర్తించు మార్పులకు అందరును తలవొగ్గవలసినదే. కాలము రూపమున దైవమే సాన్నిధ్యమిచ్చు చుండును. కన్నులెదుట యున్న సన్నివేశము కాలమేర్పరచినదే. దానిని దైవముగ దర్శించి, అందు చేయవలసిన కర్తవ్యమును నిర్వర్తించుటే గాని మరియొక మార్గము లేదు. ఇట్లు జరుగవలెనని, అట్లు జరుగవలెనని ఆకాంక్షించుట కేవలము పసితనము. కాలము అందించు మార్పులను అంగీకరించుచు

సాగువారు ప్రతిఘటన లేక సాగిపోవుట యోగుల జీవితమున గమనింపవచ్చును. జరుగుచున్న కాలము తెలియును గాని జరుగ బోవు కాలము తెలియు వారెవరును లేరు. మహర్షులకే అది వీలుపడలేదు. కాలమే దైవమని భావించి, కర్తవ్యములు నిర్వర్తించు వారికి కాలము రూపమున దైవమే సాన్నిధ్యమిచ్చును. కాలము దైవము యొక్క వ్యక్తావక్తరూపము. అట్టి కాలము నేనే అని దైవము పలికినాడు.

**3. సింహము :** మృగేంద్రు డనగా మృగములలో ఇంద్రుడని అర్థము. అనగా మృగములలో శ్రేష్ఠమగు మృగమని అర్థము. ఏ జాతి యందైనను శ్రేష్ఠుని ఇంద్రుడందురు. నరేంద్రుడు, మాన వేంద్రుడు, మనీంద్రుడు, యోగీంద్రుడు, దేవేంద్రుడు- ఇట్టి పదములను వినుచుందుము. అనగా ఆయా వర్గము లందు వారు శ్రేష్ఠులని అర్థము. ఇంద్ర అను పదము ఉత్పత్తి అర్థము పరిరక్షించువాడు. ఇదం+ద్రా = ఇంద్ర. అనగా దీనిని పరిరక్షించు వాడు. మునులలోగాని, ఋషులలోగాని, మానవులలోగాని, దేవతలలో గాని ఇతరులను పరిరక్షించుట లక్షణముగా గలవారు ఇంద్రులు.

మృగములను పరిరక్షించునది సింహము. మృగములనగా జంతువులని ఒక అర్థము. మృగములనగా చంచల మనస్సు గలవి అని మరొక అర్థము. జీవులలో చంచలత్వము సహజము. అచలత్వము అసాధారణము. మానవులలో, దేవతలలో, ముని

లలో కూడ చంచలస్వభావము కనిపించును. ఎచ్చట చంచలత్వ ముండునో అచ్చట జీవిత మస్తవ్యస్థమై యుండును. ఎచ్చట స్థిరత్వ ముండునో అచ్చట జీవితము ప్రశాంతముగ యుండును. వనమునందు మృగములు అటునిటు తీరుబడిలేక తిరుగు చుండును. కాని సింహమట్లు తిరుగదు. మృగమై యుండియు, మృగలక్షణములు అధిష్ఠించి యున్నది గనుక సింహము విశేషముగ గౌరవింపబడుచున్నది. కనుక ఎచ్చట ప్రజ్ఞ అచలమై యుండునో అచట విశేషమగు ఆకర్షణ యుండును. నరులలో అట్టి అచలత్వమును ప్రదర్శించువారు నరసింహులు. కనుక దైవము స్థితప్రజ్ఞుడు నా విభూతియే అని పలికెను. ఎచ్చట ప్రజ్ఞ స్థిరముగ నుండునో అచ్చట ఒక కేంద్రమేర్పడి పరిసరములను పరిరక్షించుచు నుండును. ఇంద్రత్వ మనగా నిదియే. మృగేంద్రు డనగా చంచల స్వభావముల నడుమ నుండు అచలమగు ప్రజ్ఞ అని కూడ తెలియ వలెను. అట్టి ఇంద్రునకు చిత్తము పరిపరి విధములుగ చిందులు వేయదు.

**4. వైనతేయుడు** : విహంగములలో నేను వైనతేయుడను అని దైవము పలికెను. వైనతేయు డనగా గరుత్మంతుడు. వినత కుమారుడు. గరుత్మంతుని వంటి బలశాలి విహంగములలో మరియొకటి లేదు. నిజమునకు లోకములందు లెక్కింప బల శాలురలో కూడ గరుత్మంతు డొకడు. అతనియందు దైవమునకు ప్రత్యేకమగు ప్రీతి కలదు. తల్లి దాస్య విముక్తికై గరుత్మంతుడు

అనన్య సామాన్యమగు కృషిని సలిపినాడు. విహంగమై యుండియు దేవతలను, దేవేంద్రుని కూడ నిర్జించి అమృతమును భూమికి కొనివచ్చినాడు. అమృత భాండమును గెలిచినను ఆ అమృతమును పానము చేయని అసామాన్య ధర్మమూర్తి. దుస్సహమగు తన కార్యముతో సమస్త లోకములను మెప్పించినాడు. అతని దీక్ష, ధర్మనిరతి, ధైర్యము, శౌర్యము, బలము మహావిష్ణువును ముగ్ధుని గావించెను. వాత్సల్యముతో శాశ్వత సాన్నిధ్యమును గరుత్మంతునికి ప్రసాదించినాడు. వైకుంఠమున నివాసము గూడ నొసగినాడు. గరుత్మంతుని రూపమున తానే యున్నానని, గరుత్మంతుని సాన్నిధ్యము తన సాన్నిధ్యమేయని లోకమునకు ప్రకటించినాడు. దైవము యొక్క స్పందనమే గరుత్మంతుడు. స్పందనము యొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసలే గరుత్మంతుని రెక్కలు. మనయందు దైవ సాన్నిధ్యము ప్రథమముగ రుచి చూచుట స్పందన స్పర్శను తెలియుటయే.

## 24

## పవనుడు - రాముడు - మొసలి - జాహ్నవి

**పవనః పవతా మస్మి రామ శ్శస్త్రభృతా మహమ్ ।**
**ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసా మస్మి జాహ్నవీ ॥ 31**

*తాత్పర్యము :* వాయువులలో పవిత్రీకరించు పవనుడను నేను. శస్త్రమును ధరించిన వారిలో రాముడను నేను. నీటి యందు వసించు జీవులలో మొసలిని నేను. నీటి వెల్లువలలో జాహ్నవిని నేను.

*వివరణము :* **1. పవనుడు :** పవిత్రీకరించు వాయువును పవను డందురు. అనిలుడు, వ్యానుడు, వాత, తనుడు, పవనుడు అనునవి పంచవాయువులు. అనిలు డనగా హోరునవీచు గాలి. వ్యానుడనగా నిత్యముండు గాలి. వాత అనునది వాయుతత్త్వము. తును డనగా సుడిగాలి. పవను డనగా పవిత్రీకరించు గాలి లేక ప్రాణవాయువు. ఇట్టి వాయువులలో పవిత్రీకరించు గాలిని పవను డనిరి. హనుమంతుడు, భీముడు ఈ వాయువునుండి ఏర్పడిన వారే. కనుక దివ్య విభూతులే. పవిత్రీకరించు పవనుడు ప్రాణముగ జీవులయందు వర్తించుచు నిత్య పవిత్రతను ఒనర్చు చున్నాడు.

మనము పీల్చు గాలి మన శరీరమును పరిశుద్ధము చేయును. మనము వదలు గాలి అపరిశుభ్రములను నెట్టివేయును. ప్రాణముగ మనయందు పనిచేయుచు, మనకు నిత్య పవిత్రతను చేకూర్చు చున్నది పవనుడే. వాయువు హోరుగాలిగను, సుడిగాలిగను, పంచ భూతములలో గాలిగను, శరీర మందు వాతముగను, వ్యాప్తి చెందు వాయువుగను అనేక రకములుగ సృష్టియందు పనిచేయు చుండును. అన్నియు దైవము నుండి వ్యక్తమైనవే అయినను అందు పవిత్రమొనర్చు ప్రాణవాయువు తానని దైవము పలికినాడు. అనగా ప్రాణ స్పందనము లందు తన సాన్నిధ్యము అమితముగ నుండునని అర్థము. తానే ప్రాణముగ దైవము మనయందున్నాడని తెలియవలెను.

**2. రాముడు :** శస్త్రములు ధరించిన వారిలో రాముడు విశిష్ట మగు వీరుడు. రాముని మించిన పరాక్రముడు మరియొకడు లేడు. భారత మహా సంగ్రామమున అనేకమంది అతిరథ మహారథు లున్నను వారెవ్వరును రామునికి సాటికాదు. లోకములందు రామునితో సరిసమానమగు శస్త్రధారి మరియొకడు లేడు. దేవ గంధర్వులలో కూడ రామునితో సరిసమానమైన సత్య పరాక్రముడు లేడు. అట్టి రాముడు తానే, తన విభూతియే అని శ్రీకృష్ణుడు పలుకుటలో ఆశ్చర్య మేమియు లేదు. కోదండమును హస్తమున ధరించి, శరమును సంధించియున్న రాముని లోకములన్నియు కూడ ఏకమైనను నిర్జించలేవు. శాంతమూర్తి యగు రామునికి కోపము రాకుండుట వలననే రామ రావణ యుద్ధము కొంత

కాలము పట్టినది. రాముని శరమునకు నిలువ గలిగిన దేదియు సృష్టి యందు లేదు.

**3.** మకరము : ఝషణము లనగా జలచరములు. మకర మనగా మొసలి. జలచరములలో నేను మొసలిని అని దైవము పలికినాడు. మకర మనగా ఐదు కరములు గలది అని అర్థము. పంచారము అని అర్థము. ఐదు కరముల జీవమేదైనను పట్టు గలిగి యుండును. ఐదు వ్రేళ్ళుగల పాదములకు కొంత పట్టు ఉండును. ఐదు వ్రేళ్ళుగల చేతులకు మరింత పట్టు ఉండును. ఐదు భూతములతో నిర్మింపబడిన శరీరమునకు జీవునిపై పట్టు ఉండును. ఐదు ఇంద్రియములకు కూడ పట్టు ఉన్నది. ఐదు ప్రాణములు ఆధారముగ జీవునికి దేహముపై పట్టు ఉన్నది. ఐదవ రాశియగు సింహరాశికి పట్టుదల ఎక్కువ. 5×2 = 10వ రాశికి పట్టు చాల ఎక్కువ. మకరరాశి అమితమగు పట్టుదలగల రాశి.

జలచరములలో మొసలికి పట్టు ఎక్కువ. జలములయందు పట్టు సాధించుట అత్యంత విశేషము. దైవము పట్టుదల రూపమున నేనే యున్నానని చెప్పుచున్నాడు. పట్టుదల గలవాడే దేనినైనను సాధించగలడు. సిద్ధి పట్టుదలకు ప్రతిరూపమే. దివ్యశక్తి యగు పట్టుదలను సద్విషయముపై వినియోగించినచో జీవు డుద్ధరింప బడును. అధర్మమున వినియోగించిన అసురుడై పతనము చెందును. పట్టుదల దైవస్వరూపమని తెలియవలెను. ఉన్నతికి, పతనమునకు ఈ అపురూపమగు శక్తియే మూలము.

**4. జాహ్నవి :** జహ్ను మహర్షి నుండి పుట్టినది జాహ్నవి. స్రోతస్సులు అనగా ప్రవహించునవి. ప్రవహించు ప్రజ్ఞలలో నేను జహ్ను మహర్షి నుండి పుట్టిన జాహ్నవి అను గంగను. భూమిపై చాల నదులు ప్రవహించు చున్నను, ఇతర లోకములలో కూడ ప్రవహించు ప్రజ్ఞలు ఎన్ని యున్నను అందు నేను ప్రత్యేకముగ గంగయందు సాన్నిధ్య మిచ్చుచున్నాను అని తెలియవలెను. గంగోత్రి వద్ద గల పర్వత శిఖరములలోని ఒక చెవివంటి శిలాకారముల నుండి మొట్టమొదటగ వెలువడుచున్న గంగ గోచరించును. ఆ శిలాకార బిలమును జహ్ను మహర్షి చెవిగ పురాణములు వర్ణించు చున్నవి. అచ్చటికి గంగ ఎట్లు చేరినదో తెలియదు. గంగ కనిపించుట అచ్చటనే ప్రారంభమగును. ఎచ్చటనుండి అచ్చటికి గంగ చేరుచున్నదో స్థూలదృష్టికి గోచరము కాదు. కాని అచ్చట నిరంతరము వెలువడుచునే యుండును. ప్రవాహమునకు అంతరాయ మెప్పుడును కలుగదు. నిత్యము ఊరుచు ప్రవహించు చున్న ప్రజ్ఞను స్రోతస్సు లందురు. అట్టి స్రోతస్సులలో గంగ అత్యంత విశేషము, విశిష్టము అయి ఉన్నది. కనుక గంగా స్నానమునకు ఒక ప్రత్యేకత ఏర్పడినది. ప్రవాహములలో నేను గంగనని దైవము తెలుపుటచే గంగ దర్శనము దైవదర్శనమే అని తెలియవలెను. వేద సంప్రదాయమున అత్యంత పవిత్రములుగ మన్నింపబడు వానిలో గంగ యొకటి. గంగ, గౌరి, గీత, గోవు, గాయత్రి, గోవిందుడు- ఈ ఆరును దైవవిభూతులలో గకార కూటము.

(25)

## ఆది మధ్య అంత స్థితులు - అధ్యాత్మవిద్య - వాదనము

**సర్గాణా మాది రంతశ్చ మధ్యం చైవాహ మర్జున ।**
**అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతా మహమ్ ॥ 32**

తాత్పర్యము : అర్జునా! సృష్టి ఆది, మధ్యమ, అంతస్థితులు నేనే అయి ఉన్నాను. విద్యలలో ఆత్మవిద్య నేనే అయి ఉన్నాను. తత్వవాదనమున వాదనముగ నేనే యున్నాను.

వివరణము : సృష్టి ఏర్పడుట, వృద్ధి కలిగి స్థిరమగుట, అటుపైన శుష్కించి అంతమగుట నేనుగనే జరుగుచున్నది. నేనను పరతత్త్వము నుండి పరాప్రకృతి వ్యక్తమగును. పరాప్రకృతి నుండి అనేక సృష్టులు వచ్చిపోవుచుండును. మన ప్రకృతి నుండి మనకు అనంతముగ భావములు జనించి, వృద్ధి చెంది, అంతమైనట్లే పరాప్రకృతి నుండి అనేక సృష్టులు జనించి, వృద్ధి చెంది, నశించును. ప్రకృతి నిర్మించు ఈ లోకములన్నియు తానే నిండి యున్నాడు. పరమే నిండి యుండును. ఎన్ని నిర్మాణములు చేసినను అవి యన్నియు తనయందే నిర్మాణమగును. కనుక అట్టి నిర్మాణము లలో తానే నిండి యుండును. చోటులో ఇళ్లు కట్టినట్లు అనేక సృష్టు లేర్పడుచుండును. ఆ ఇళ్ళలో చోటే నిండియున్నట్లు

ఏర్పడిన సృష్టి యన్నిటియందు తానే నిండి యుండును. సృష్టి, స్థితి, లయములందు తానే యున్నాడు. సృష్టికి పూర్వము తానే యున్నాడు. సృష్టి అంతమొందినను తానే యున్నాడు. తానే సృష్టిగ కూడ యున్నాడు. తాను కాని దేదియు లేదు. కనుక అంతయు తన విభూతియే. అందుకనే *"మత్తః పరతరం నాస్తి"* 'నేను కాని దేదియు లేదు' అను సత్యము ముందు అధ్యాయముల లోనే ప్రకటించినాడు.

**2. అధ్యాత్మ విద్య :** సృష్టి యందెన్నియో విద్యలు గలవు. కాని ఆ విద్యలు తరింపునీయవు. తరింపు నిచ్చు విద్య ఒకటియే. అది అధ్యాత్మ విద్య. అనగా ఆత్మ నధిష్ఠించి యున్న తత్త్వము నెరుగుట. ఆత్మ అనగా "నేను". నేను నేనుగ నుండుటకు మూల మేదియో తెలియుటయే అధ్యాత్మ విద్య. సర్వము తానే అయిన నేను ఉపాధులలో నుండి అనేకమగు నేనులుగ గోచరించును. ప్రతి ఘటమునందును ఆకాశ ముండును. ఎన్ని ఘటము (కుండలు) లున్నచో అన్ని ఆకాశములు కనిపించును. కాని ఒకే ఆకాశము ఇన్ని కుండలలోను నిండియున్నది. నదియే గ్రామస్థుల బిందెలలో నిండి తల ఒక గృహమునకు ఏగును. అన్ని ఇండ్లలో, అందరి బిందెలలో ఉన్న నీరు నది నీరే అయినప్పటికి, తమ ఇంటిలోని నీరు తమదిగ గ్రామస్థులు భావింతురు. ఒకే సూర్యుడు తూర్పు గవాక్షము నుండి ఎవరికి వారుగ దర్శింతురు. సూర్యు డొక్కడే. ఎవరికి వారు వేరుగ దర్శింతురు. ప్రతివారును 'నేను, నేను' అని పలుకుచుందురు. అందరి యందొక్కడే నేనున్నాడు.

ఒకటే అనేకముగ గోచరించును. నేను అని పలుకు ప్రతి వ్యక్తి, తన నేను యొక్క మూలమును శాశ్వతమగు నేనుగ తెలియ వలెను. అట్లు తెలిసిన వానికి తానే సర్వత్ర గోచరించును. వేరొకటి యుండదు. అట్లు నేను యొక్క అనంతత్వమును, శాశ్వతత్వమును, ఏకత్వమును నిరంతర అనుభూతిగ తెలియుట ఆత్మ నధిష్ఠించి యున్న ఆత్మ అని తెలియుట. ఇట్లు తెలిసిన వానికి సర్వము ఈశ్వరమయమే అని తెలియును. ఇంతకు మించి తెలిసిన విద్య లేమియు లేవు. అట్టి విద్యగ తానే యున్నానని ఈశ్వరుడే పలుకు చున్నాడు.

**3. వాదనము** : తత్త్వ విచారము, తత్త్వ విచికిత్స, తత్త్వ వాదనము, తత్త్వముతో కూడి యుండుటకే. కలియుగమున అట్టి వాదనా రూపమున సాక్షాత్తు ఈశ్వరుడే శంకరభగవత్పాదులుగ భరత భూమి యందు ముమ్మారు పర్యటన చేసెను. తత్త్వ వాదముతో భరత ఖండమున నాలుగు దిక్కులందును సత్య పీఠము లేర్పరచినారు. శంకరుల తత్త్వ వాదనము వలననే కలియుగమున సత్యము భూమి నలుచెరగుల పునస్థాపితమై జీవుల నుద్ధరించుచున్నది. శంకర భగవత్పాదుల దిగ్విజయ వాదనము దైవవిభూతియే. సత్యమును నిరూపించుటయే వాదనమునకు సిద్ధి. సత్యవాదనముగ తానే యున్నానని దైవము పలుకుచున్నాడు. సత్యవంతులకే సత్యవాదనము కూడ సాన్నిధ్య మిచ్చును. అట్టి వాదన ఒక విభూతి.

(26)

## అకారము - ద్వంద్వము - కాలము - విధాత

**అక్షరాణా మకారోఽస్మి ద్వంద్వః సామాసికస్య చ ।**
**అహ మేవాక్షయః కాలో ధాతాహం విశ్వతోముఖః ॥ 33**

*తాత్పర్యము :* అక్షరములలో నేను అకారమును. సమాసములలో నేను ద్వంద్వ సమాసమును. అక్షయమగు కాలము నేనే. విశ్వముయొక్క విధి విధానము నేనే.

*వివరణము :* **1. అకారము :** అక్షరమను పదమే అకారముతో ప్రారంభమగును. అన్ని భాషలలోను అకారమే మొదటి అక్షరము. ఆంగ్ల మొక్కటియే ఏ కారముతో మొదలవుతుంది. ఏ కారమందు కూడ 'అ' శబ్దమున్నది. ఆ, ఇ కలసినపుడు 'ఏ' అగును. ఆంగ్లమున అకారమునకు ఏ కారమునకు వాడు అక్షరము ఒకటియే. ఇతర భాష లన్నిటి యందు 'అ' మొదటి అక్షరముగ నున్నది.

అక్షర మనగా క్షరము కానిది అని అర్థము (అ+క్షరము). క్షరము కానిదనగా నశించనిది. ఎప్పుడునూ ఉన్నది. త్రికాలముల కతీతముగ కూడ నున్నది. మిగిలిన వన్నియు అక్ష+రములు,

అనగా కేంద్రము నుండి పరిధికి కొనిరాబడినది. కేంద్ర మేర్పడుటకు పూర్వము కూడ అకార మున్నది. అకారమే అక్షరము లన్నిటికిని పునాది. వాఙ్మయ మంతటికి పునాది. పిండి లేక రొట్టె లేనట్లు అకారము లేనిచో వాఙ్మయమే లేదు. సృష్టి కాధారమైనటువంటి పరతత్త్వము తానే యని, అక్షరములలో 'అ' తానని దైవము పలికినాడు. అయ్య, అమ్మ అను పదములు కూడ అకారముతోనే ప్రారంభమగు చున్నవి. అకారము యొక్క విభూతి అనంతము.

**2. ద్వంద్వ సమాసము :** సమాసములలో తాను ద్వంద్వమని దైవము తెలిపినాడు. ద్వంద్వ మనగా రెండు అని అర్థము. ఒకటియే రెండుగ నుండును. ఒకటి రెండైన గాని సృష్టి ఏర్పడదు. సృష్టి మూడవది. పరమగు తత్త్వము పరమ పురుషుడుగను, పరాప్రకృతి గను, అర్థనారీశ్వరమై యుండును. పరము ప్రకృతి- పురుషుల సమాగమ ప్రజ్ఞ. దైవము కేవలము పురుషుడు కాదు. కేవలము స్త్రీయు కాదు. స్త్రీ లేని పురుషుడు, పురుషుడు లేని స్త్రీ లేరు. పురుషుని యందు గల స్వభావమే అతని స్త్రీ. స్త్రీ యందు గల నేనను ప్రజ్ఞ పురుషుడు. సృష్టికి పూర్వము కూడ ఇరువురు ఒకటిగ నుందురు. సృష్టి యందు కూడ ఇరువు రుందురు.

దైవము పురుషుడని భావించుట పూర్ణజ్ఞానము కాదు. స్త్రీగ భావించుట కూడ పూర్ణజ్ఞానము కాదు. దైవము పరిపూర్ణమగు, ఎక్కువ తక్కువలు లేని స్త్రీ, పురుష ప్రజ్ఞ. కనుకనే అర్థనారీశ్వర

తత్త్వము వేదర్షు లందించిరి. శివ-శక్తుల సమాదరణము వలననే జీవుడు పరిపూర్ణుడగును. లక్ష్మీనారాయణు లన్నను, వాణీ హిరణ్య గర్భులన్నను, శచీ పురందరులన్నను, అరుంధతీ వశిష్ఠులన్నను, మాతా పితరులన్నను- ఒకే తత్త్వము రెండుగ ఏర్పడి యున్నదని తెలియవలెను. అట్లే దేవుడు - జీవుడు, జీవుడు - స్వభావము. ఇట్లన్నిటియందు ఒక తత్త్వమే రెండుగ గోచరించును. కనుక ద్వంద్వ సమాసము నేనని దైవము పలికినాడు. సృష్టి యంతయు అర్ధనరుడు, అర్ధనారిగ దర్శించువారు ప్రకృతి, పరముల నాద రించి ఉత్తీర్ణులగుదురు. ప్రకృతిని కాదన్నను, అందవ్యక్తముగ నున్న పురుషుని కాదన్నను ఒక కన్ను కోల్పోయిన వారగుదురు. స్త్రీ తత్త్వము తెలియనివారే స్త్రీని నిర్జించుట, వర్జించుట, అణగ ద్రొక్కుట, మతముల పేరున, దైవము పేరున చేయుదురు. సమాన ముగ గౌరవించినవారే పూర్ణులగుదురు. యోగులకు మాత్రమే అట్టి సమదృష్టి యుండును. సమదృష్టి, సమదర్శనము, సమ భావము, సమవర్తనము గలవారికే దైవమనగా నేమో తెలియును.

**3. కాలము :** కాలము భూత భవిష్యత్ వర్తమాన కాలముగ తెలియబడుచుండును. భూత వర్తమాన కాలములు తెలియుచు నుండును. జరిగిపోయినది, జరుగుచున్నది తెలియు చుండును. జరుగబోవునది, రాబోవు కాలమును తెలుపును. ఇట్లు కాలము మూడు రకములుగ అవగాహన అగును. ఇట్లు త్రిగుణాత్మకముగ

వ్యక్తమగు కాలమునకు మూలము మహాకాలము. అది అక్షయము. అనగా తరుగనిది. అక్షయమగు కాలము నేనే అని దైవము పలుకుచున్నాడు. అక్షయము నుండే త్రిభుజాత్మకముగ లేక త్రివిధములుగ కాలము ప్రకటింపబడుచు నుండును. మహర్షులు ప్రకటింపబడు భవిష్యత్‌ను తెలుపుదురేమో గాని, ప్రకటింపబడక అక్షయముగ నున్న కాలమును తెలియలేరు. అక్షయముగ నున్న కాలము దైవమే. అందుండి సంకల్పము ఏర్పడిన వెనుక అది మూడు కాలములలో అవతరించును. అవతరించక ముందు ఉన్న కాలమును దైవమే తెలియగలడు. భూత, భవిష్యత్, వర్తమాన కాలములు తెలిసిన బ్రహ్మర్షు లుండవచ్చును కాని, అక్షయమగు కాలము తెలియగల వారెవ్వరు లేరు. అది తానే యగుటవలన తనకే తెలియుట యుండును.

**4. విధాత :** సృష్టి నిర్మాణమంతయు ఒక విధానమున జరిగినది. త్రిగుణములు, పంచభూతములుగ ఏర్పడిన పరాప్రకృతి యందంతయు పరతత్త్వము నిండి యున్నది. ఐదు భూతములు, మూడు గుణములు, మూల ప్రకృతి యొక్క అష్ట స్థితులు (అష్ట ప్రకృతులు), తొమ్మిది మూల ప్రకృతి లేక పరాప్రకృతి. పది పరమ పురుషుడు. ఇందెనిమిది ప్రకృతులు అనేక విధములుగ సమ్మేళనము చెందుట వలన అనేక లోకము లేర్పడినవి. స్థూల, సూక్ష్మ, కారణ లోకములు, కారణమున కతీతమైన లోకములు కూడ

ఏర్పడినవి. అతి ముదురు, ముదురు, లేత, అతి లేత లోకములు తదనుగుణమగు జీవులకు ఏర్పరచబడినవి. ఆయా లోకములకు, అందు వసించు లోకులకు, లోకపాలకులకు వేరు వేరు ధర్మములు ఏర్పరచుట జరిగినది. ఆయా లోకములలో సంచరించుటకు, ఆయా ధర్మములను పాటించు విధాన మేర్పడినది. పాటింపనిచో శిక్ష, శిక్షణము కూడ ఏర్పరచుట జరిగినది. అనుసరించినచో జీవులు ఆనందముగ వసించు సదుపాయము లున్నవి. ఈ విధానము ననుసరించిన వానికి సృష్టి ఆనందమిచ్చును. అనుసరింపని వానికి, ప్రతిఘటించు వారికి బంధము లేర్పడును. ఇట్టి ధర్మ స్వరూపము నధిష్ఠించి యున్నది నేనే యని దైవము పలుకు చున్నాడు. అతడే విధాత.

## 27

## దైవ విభూతులు

**మృత్యు స్సర్వహర శ్చాహ ముద్భవశ్చ భవిష్యతామ్ ।**
**కీర్తి(శ్శీర్వాక్చ నారీణాం స్మృతి ర్మేధా ధృతిః క్షమా ॥ 34**

*తాత్పర్యము :* నేనే మృత్యువును. పుట్టుకయు నేనే. జీవుల కీర్తిగ నేనే యున్నాను. జీవుల సంపదగ కూడ నేనే యున్నాను. వాక్కు నందలి సాధుత్వము నేను. స్త్రీల పుణ్యశీలత నేను. మనుష్యుల స్మృతి నేను. జ్ఞానము నేనే. మేధ నేనే. ధైర్యము నేనే. క్షమ కూడ నేనే. ఇవి యన్నియు నా విభూతులు.

*వివరణము :* ఈ ఒక్క శ్లోకమున దైవము పదునొకండు విభూతులు తెలిపినాడు. దేనికదియే ప్రత్యేకము. క్లుప్తముగ ఈ విభూతుల వివరణము ఇట్లున్నది.

**1. మృత్యువు :** మృత్యువు దైవ విభూతియని భావించుట అరుదు. మృత్యువు జీవునికి దేహము నుండి విడుదల కలిగించి, సుఖము నిచ్చును. గాఢ నిద్ర సుఖము నీయుట లేదా! మృత్యువు ఒక దీర్ఘమగు నిద్ర. మృత్యు వనంతరము జీవునికి అమితానందము కలుగును. పంజరమున గల చిలుక పంజరము నుండి బయల్పడి

నచో ఆనందించునా లేదా? బోనులోని జంతువు అందుండి బయల్పడినపుడు ఆనందించును గదా! ఒకే దేహ మందు బంధింపబడిన జీవుడు దేహానంతరము అంతకు ముందు లేని స్వేచ్ఛ ననుభవించును. కనుక మృత్యువు విభూతి. దేహము ముదుసలియై, కాళ్ళు చేతులు సరిగ పనిచేయక, కనపడక, వినపడక, ఆకలి రుచి వాసన లేక యుండు వృద్ధరూపము నుండి బయల్పడుట కారాగృహము నుండి బయల్పడుటయే. కనుక నిశ్చయముగ మృత్యువు విభూతియే.

**2. పుట్టుక :** పాత వాహనము తీసివేసి, సరిక్రొత్త వాహనము క్రొత్త హంగులతో ఉచితముగ నిచ్చినచో ఆనందమే గదా! అట్లే మరణించిన వానికి నూతన దేహము యిచ్చుట ఒక విభూతియే. అరకొరగ ఉపయోగపడెడి శరీరమును తీసివేసి, నూతన శరీర మిచ్చినపుడు అది విభూతియే యగును. పాచిన అన్నము కన్న సిద్ధాన్నము రుచికరము కదా! చావు పుట్టుకలు దైవమేర్పరచిన సౌకర్యము. నూతన సౌకర్యములను ఎప్పటికప్పుడు ఏర్పరచి జీవుల సుఖము, శ్రేయస్సు, వృద్ధి అందించు దైవము ఇట్టి మౌలిక మగు మార్పులు కాలము రూపమున నిర్వర్తించు చుండును. పుట్టుటయు, పోవుటయు కూడ విభూతియని తెలియుటకు జీవునికి జ్ఞాన మావశ్యకమై యున్నది. అది కూడ తానేయని ఈ శ్లోకముననే తరువాతి పదములలో తెలిపినాడు.

**3. కీర్తి :** కీర్తి దైవ విభూతియే. అది దైవానుగ్రహముగ

లభించును. కొందరికి ఎనలేని కీర్తి కలుగుచు నుండును. కారణము తెలియుట కష్టము. కీర్తికి సమర్థతతో కూడ సంబంధము లేదు. కొందరిని అనాయాసముగ కీర్తి వరించుచు నుండును. కొందరెంత ప్రయత్నించినను కీర్తి కలుగదు. పూర్వాపరములు తెలిసినవారే కొంత గ్రహింపగలరు. పూర్వపుణ్యమే కీర్తిగ పరిణమించునని కొందరి అభిప్రాయము. పాండవులలో యుధిష్ఠిరుని మించినవాడు లేడు. భీముని కన్న జయములు కూర్చినవాడు లేడు. కాని కీర్తి అర్జునుని వరించినది. ఇట్లెన్నియో తార్కాణములు గోచరించును. కీర్తి దైవ విభూతియని భావించవలెను గాని, తన గొప్పదనముగ భావింపరాదు.

**4. సంపద** : సంపద ఎట్లు వచ్చునో ఎవరికిని తెలియదు. కొబ్బరికాయలోని నీరువలె సంపద అనూహ్యరీతిలో కలుగును. కనుక ఇదియు దైవ విభూతియని భావింపవలెనుగాని, తన సమర్థత అనుకొనరాదు.

**5. మృదుభాషణము** : జీవ స్వభావమన్నది పరిశుద్ధత వలన వాక్కు సత్వగుణ ప్రధానమై భాసించును. మృదువుగ నుండును. వినువారిని ఆకర్షించును. సత్వము దైవ విభూతి. రామలక్ష్మణుల యందు, హనుమ యందు, గణపతి యందు, సరస్వతి యందు, ఋషులలో వాల్మీకి యందు, పక్షులలో కోకిలయందు యిట్టి మృదుత్వమును వాక్కున దర్శించి పెద్దలందించినారు. ఎచ్చట నైనను మృదుభాషణము తటస్థపడినచో అచట దైవము వాక్కు రూపమున వసించి యున్నాడని తెలియవలెను.

**6. స్త్రీ శీలము** : పుణ్యశీలము గల స్త్రీ రూపమున నున్నది దైవవిభూతిగనే తెలియవలెను. పతివ్రత లందరు అట్టి పుణ్య శీలము గలవారే. పుణ్యస్త్రీ సాంగత్యమున పురుషుడు రక్షింపబడు చున్నాడు. పుణ్యస్త్రీ అనుగ్రహమును పొందుట దైవానుగ్రహమును పొందుటయే. పుణ్యస్త్రీ యందు గల వైభవమే పురుషుని కాపాడ బడుచుండును. తులసి వలన జలంధరుడట్లే కాపాడ బడినాడు. భరతజాతి నేటికిని అధోగతి చెందకుండుటకు కారణము భారత స్త్రీయే.

**7. స్మృతి** : జ్ఞప్తి కలుగుట భగవద్విభూతి. కొందరియందు జ్ఞాపకశక్తి అద్భుతముగ పనిచేయును. అట్టివారే అవధానములు కూడ చేయుచు నుందురు. జన్మల తరబడి స్మృతియున్న ఋషులు గలరు. మరపు రాకుండుట దైవవిభూతి. చాలమందికి గింజు కున్నను తెలిసిన విషయమే జ్ఞప్తికి రాదు. జ్ఞప్తికి వచ్చుట ప్రత్యక్ష ముగ గోచరించు విభూతి.

**8. జ్ఞానము** : జ్ఞానము దైవమే. జ్ఞాని యనగా నేనే అని దైవము పలికినాడు. జ్ఞానమునకు వలసినది జిజ్ఞాస. తెలుసు కొనవలెననెడి ఆసక్తి. లోన జిజ్ఞాస కలిగిన వానికే జ్ఞానము లభించును. అట్టి జిజ్ఞాస అందరికిని యుండదు. అట్టి జిజ్ఞాస రూపమున యున్నది దైవవిభూతియే.

**9. మేధ** : మేధ యనగా లోదృష్టి. కనపడుచున్నది ఆధార

ముగ, కనపడని విషయమును తెలియుట మేధ. ఇట్టి మేధ నా విభూతియే అని దైవము పలుకుచున్నాడు.

**10. ధృతి :** ధృతి యనగా తనను తాను ధరించి యుండుట. తానే తనకు ఆలంబనముగ నుండుట. ఇతర ఆలంబనములపై ఆధారపడక, ఆత్మపై నాధారపడుట. ఇట్టి వానియందే దైవ విభూతి ధైర్యమువలె గోచరించును.

**11. క్షమ :** ఓర్పు అద్భుతమగు దైవ విభూతి. ఓర్పునకు పాండవాగ్రజుడగు యుధిష్ఠిరుడే పరిపూర్ణమగు ఉదాహరణము. ఎవరియందు ఓర్పు అధికముగ గోచరించునో, వారియందు దివ్య విభూతి స్థానము గొనియున్నదని తెలియవలెను.

(28)

## బృహత్సామ - గాయత్రి - మార్గశీర్షము - వసంత ఋతువు

**బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసా మహమ్ ।**
**మాసానాం మార్గశీర్షోఽహం ఋతూనాం కుసుమాకరః ॥35**

*తాత్పర్యము :* సామలలో నేను బృహత్సామను. ఛందస్సులలో గాయత్రిని. మాసములలో మార్గశీర్షమును. ఋతువులలో వసంత ఋతువును.

*వివరణము :* **1. బృహత్సామ :** సామవేదము నందలి మంత్రములను సామము లందురు. జీవ ప్రజ్ఞకు, దైవ ప్రజ్ఞకు సామ్యము కూర్చునవి సామలు. ప్రాణాపానముల సామ్యస్థితిని సమాన వాయువందురు. అట్టి సమాన స్థితి యందు 'సోహం' అను శబ్దము వినపడును. సోహం నందలి హల్లులను విసర్జించినచో 'ఓం' అనెడి ప్రణవము తెలియబడును. ఇది అనాహత శబ్దముగ నుండును. ఆ ప్రణవ నాదము దైవమునకు, జీవునకు నడుమ సామ్య మేర్పరచును. అట్టి బృహత్సామను నేను అని దైవము పలుకుచున్నాడు.

**2. గాయత్రి :** ఛందస్సులలో నేను గాయత్రిని. మూడు

పాదములలో, పాదమునకు ఎనిమిది అక్షరములుగ ఇరువది నాలుగు అక్షరములతో గాయత్రీ ఛందస్సు అలరారు చున్నది. ఈ ఇరువది నాలుగు అక్షరములు సృష్టి నిర్మాణ నమూనాకు సంబంధించిన ఇరువది నాలుగు అంశములుగ తెలుపబడినవి. అహోరాత్ర కాలము ఇరువది నాలుగు గంటలు. సంవత్సరమున ఇరువది నాలుగు (12×2=24) పూర్ణిమలు, అమావాస్యలు ఏర్పడు చుండును. అవి ద్వాదశ మాసములు గాను, ఆరు ఋతువులు గాను దర్శించవచ్చును. గాయత్రీ గానము వలన సంవత్సర రూపమున కాలము జీవులను స్పృశించి ఉద్ధరించుచు నుండును. గాయత్రీ ఛందస్సు ఘనవిద్యకు మూలమై యున్నది. ఘనమునకు గాయత్రి మంత్రమునకు గల సామ్యమెరిగిన ఉపాసకుడు మూడు లోకములందు, ఎనిమిది ప్రకృతులుగ విప్పారుచున్న చైతన్య మును అనుభూతి చెందును. దానివలన జ్ఞానము పరిపూర్ణ మగును. అట్టి గాయత్రీ ఛందస్సు తానే యని దైవము పలుకు చున్నాడు.

**3. మార్గశీర్ష మాసము** : ద్వాదశ రాశులలో తొమ్మిదవది, మాసములలో తొమ్మిదవది అగు మార్గశీర్ష మాసము నేనే అని దైవము పలికినాడు. జీవులను శీర్షము చేర్చు మార్గము మార్గశీర్ష మాసము నందు సూర్యకిరణములచే తెరువబడును. ఆ మార్గము ననుసరించి జీవులు శీర్షమందలి దివ్యత్వముతో అనుసంధానము చెందవచ్చును. బృహస్పతి గురువుగ ఈ మార్గము నిర్వర్తింపబడు

చున్నది. అట్టి మార్గము నేనే అని దైవము తెలుపుతున్నాడు. మార్గమూ నేనే, గమ్యమూ నేనే అనెడి సత్యము మార్గశీర్ష మాసమున నిగూఢముగ నున్నది. సంప్రదాయమున వైకుంఠము నకు పోవు ఉత్తరద్వారము ఈ మాసమున తెరువబడునని ఆస్తికులు భావించు చుందురు.

**4. వసంత ఋతువు** : ఋతువులలో వసంతము ఆదిగ నుండును. ప్రకృతి అంతయు నూతనమగు మొలకలు వేయును. ఈ ఋతువునందు దైవము సంవత్సర చక్రమున నూతనముగ ప్రవేశించి, వసించుట ఆరంభించును. కనుక ఈ ఋతువును వసంత ఋతువనిరి. దైవము హరియై మరల మరల దిగివచ్చుచు నుండును. అట్లు దిగివచ్చుట ఉద్ధరించుటకే. కనుక వసంత ఋతువు తానే యని పలికినాడు.

(29)

## జూదము - తేజస్సు - జయము - సత్వము

**ద్యూతం ఛలయతా మస్మి తేజ స్తేజస్వినా మహమ్ ।**
**జయోஉస్మి వ్యవసాయోஉస్మి సత్త్వం సత్త్వవతా మహమ్ ॥36**

*తాత్పర్యము* : జూదరులలో జూదము నేను. తేజోవంతులలో తేజస్సు నేను. ప్రయత్నములో జయము నేను. గుణములలో సత్వము నేను.

*వివరణము* : **1. జూదము** : కర్మఫలమును ధీరతతో స్వీకరించు సంసిద్ధత జూదము నందవసరము. జూదరి తను నిర్వర్తించిన కర్మలనే పెట్టుబడిగ జూదమాడును. జూదమున జయాపజయములు రెండును సద్యోఫలముగ లభించును. జూదమాడి ఓడిపోవుట, గెలుచుట రెండునూ సంభవమే. అదృష్టము పరీక్షగ జూదమాడుట యుండును. అనగా జయాపజయములకు సంసిద్ధుడై, తన కర్మఫలమును స్వీకరించుటకు సిద్ధపడుటయే జూదము. స్థితప్రజ్ఞుడు మాత్రమే ఇట్టి సంసిద్ధత కలిగియుండును. నిజమునకు జీవితమున మరుక్షణ మేమి జరుగునో ఎవ్వరికిని తెలియదు. లాభనష్టములు, కష్టసుఖములు, జయాపజయములు

జీవితమున అప్పటి కప్పుడు తారసిల్లును. స్థితప్రజ్ఞులు మాత్రమే సంభవించుచున్న సంఘటనలను సమదృష్టితో అందుకొందురు. జూదము కూడ అట్టిదే. గెలుపోటములు ధీరతతో సహించుట యోగి లక్షణము. జూదరి లక్షణము కూడ అదియే. కనుక దైవము జూదము నేనని పలికినాడు.

**2. తేజస్సు** : సృష్టియందలి తేజస్సు భర్గోమండలమందు, సవితృమండలమందు, సూర్యమండలమునందు, భూమండల మందు, అన్ని గ్రహ మండలములందు, తారకామండలములందు వ్యాప్తి చెందియున్నది. జీవులయందు కూడ ఆ తేజస్సే ఎఱుకగ పనిచేయుచున్నది. ఎచ్చట తేజస్సు స్పష్టముగ గోచరించునో అచ్చట దైవమును దర్శించుట విభూతి. ఎఱుకగ లేక పన్నానుబట్టి, సత్యధర్మాచరణనుబట్టి తేజస్సు పెరుగుచు నుండును. సూర్య మండలము నంతటిని సత్యధర్మములతో నిర్వర్తించు వాడగుటచే సూర్యుని తేజస్సు అమితమై గోచరించును. మానవులయందు ఋషులు, మహర్షులు, రాజర్షులు, బ్రహ్మర్షులు వివిధ పన్నాలలో నున్న తేజోరూపులే. తేజోకాంతిని దర్శించగనే దైవము గుర్తింప బడుట, దర్శించుట అనునవి నిజమగు విభూతి. రాముని దర్శించిన హనుమంతునకు, హనుమంతుని దర్శించిన రామునకు గోచరించి నది తేజస్సే. అది సత్యధర్మముల కాంతి. కనుకనే వారిరువురును ఒకరికొకరు ఆకర్షితులైనారు. తేజోదర్శనమున చూచువాని ఎఱుక వికసించును. సద్గురు దర్శనము సదాచారుడైన శిష్యునికి అట్టి దివ్య దర్శనములే అందించును.

**3. జయము :** పుణ్యఫలమే జయము. పుణ్యమనగా పూర్వము చేసిన సత్కృషి. అట్టి సత్కృషిని వ్యవసాయ మందురు. సత్కర్మాచరణము జయము నిచ్చును. ఆచరణమందలి సత్యమే జయమునకు కారణము. సత్ప్రవర్తనము, సత్కృషి జయముగ పరిణమించును. సత్కర్మాచరణమనగా ధర్మముతో కూడిన ఆచరణమని కూడ తెలియవలెను. ఎచ్చట ధర్మముండునో అచ్చట జయము వైభవముతో కూడి యుండును. కనుక కర్మాచరణమనెడి వ్యవసాయము ధర్మముతో కూడియున్నపుడు జయము రూపమున వైభవము నిచ్చును. ఇతిహాసములగు రామాయణము, మహాభారతము దీనినే అనాదిగ బోధించుచు నున్నవి. శాశ్వతమగు జయమునకు సత్ప్రయత్నము ఆవశ్యకము. అట్టి సత్ప్రవర్తనము, విజయము తానే అయి ఉన్నానని, ఆ రెండునూ తన విభూతియే అని దైవము పలుకుచున్నాడు. సత్ప్రయత్నము విభూతిని ప్రసాదించును. జయము కూడ విభూతిని ప్రసాదించును.

**4. సత్వగుణము :** జీవులు త్రిగుణాత్మకులు. వారు రజస్ తమస్సులచేతను, సత్వము చేతను పరిపాలింపబడుచు నుందురు. అందు సత్వగుణము అధికముగ నుండుట భగవద్విభూతి. సత్వగుణ మధిక మగుచున్నకొలది, రజస్ తమస్సులు సత్వమునకు లోబడి పనిచేయును. సత్వగుణము సత్యదర్శనము నిచ్చును. సత్యదర్శనము అపురూపమగు విభూతి. యుధిష్ఠిరుడు సత్వగుణ సంపన్నుడు. కనుకనే నిత్యము భగవత్ సాన్నిధ్యము ననుభవించు

చుండెడివాడు. భీమార్జునులు కూడ సత్వగుణ సంపన్నులే అయినను అపుడపుడు రజస్ తమస్సులు అధిగమించి వారిని కొంత కష్టనష్టములకు గురిచేసినవి. ముగ్గురన్నదమ్ములయందు పూర్ణసత్వము యుధిష్ఠిరుని యందు ఉండుటవలన, అతని యందు దైవవిభూతి గరిష్ఠస్థాయిగ నుండెడిది. సత్వగుణము సదా అధిష్ఠించి యున్నపుడు, అట్టి జీవుల రూపమున తానే యున్నానని దైవము బోధించుచు నున్నాడు. ధర్మము ననుసరించువారు క్రమముగ సత్వమున పెరుగుదురు. సత్వమధికముగ నున్నపుడు సత్వదర్శనము, దైవవిభూతి వారి నావరించి యుండును.

(30)

## వాసుదేవుడు - ధనంజయుడు - వ్యాసుడు - శుక్రమూర్తి

**వృష్ణీనాం వాసుదేవో$\,$ऽస్మి పాండవానాం ధనంజయః ।**
**మునీనామ ప్యహం వ్యాసః కవీనా ముశనా కవిః ॥ 37**

*తాత్పర్యము :* వృష్ణి వంశము వారిలో నేను వాసుదేవుడనై యున్నాను. పాండవులలో ధనంజయుడనై యున్నాను. మును లలో వ్యాసుడుగ నున్నాను. కవులలో శుక్రమూర్తినై యున్నాను.

*వివరణము :* **1. వాసుదేవుడు** : వృష్ణి వంశమనగా యదు వంశము. యదువంశమున వసుదేవుని కుమారుడైన వాసుదేవునిగ యున్నది నేనే. వాసుదేవుడనగా సమస్త సృష్టి యందలి రూపముల యందు వసించి యుండువాడు. విష్ణు రూపముగ ఏర్పడిన సృష్టి యందు ప్రతి జీవుని హృదయమందుండి నడిపించు వాసుదేవు డుగ దైవమే యున్నాడు. నారాయణుడే విష్ణువుగ నేర్పడి అందు వాసుదేవునిగ వసించి యుండును. సమస్త జీవులందు హంస స్వరూపుడై వసించి యుండువాడు వాసుదేవుడు. అట్టి వాసు దేవ తత్వమే వసుదేవుని ద్వారా శ్రీకృష్ణుడుగ ధర్మ నిర్వహణ కావించుచు నున్నాడు. రూపమంతయు విష్ణుమయము కాగా అందలి స్పందనము వాసుదేవుడే. రెండింటికి మూలము

నారాయణుడు. అతని ధర్మవిచక్షణ ప్రద్యుమ్నుడు. ఇట్లు పరమగు నారాయణు డాధారముగ విష్ణు, వాసుదేవ, ప్రద్యుమ్న వ్యూహము లేర్పడుచున్నవి. తన నుండి తానే దిగివచ్చువాడు గనుక సంకర్షణుడు అని కూడ పిలువబడు చున్నాడు. ప్రస్తుతమున ఈ బోధలు నిర్వర్తిస్తూ కృష్ణరూపమున నున్నది వాసుదేవుడే అని తెలుపు చున్నాడు. ఈ కనపడుచున్నదంతయు విష్ణు వాసుదేవ వ్యూహమే.

**2. ధనంజయుడు** : పాండవులలో నేను ధనంజయుడనని పలికెను. ధనంజయుడు అర్జునుని నామములలో నొకటి. ధర్మ సంపద దండిగ గలవాడు. శౌర్య సంపదను భగవత్ ధర్మ నిర్వహణ మునకు సహకార మందించినవాడు ధనంజయుడు. ప్రస్తుతము ఈ భగవత్ బోధకు కారణమైనవాడు కూడ ధనంజయుడే. భగవత్ప్రీతికి నోచుకొనినవాడు కూడ పాండవులలో అర్జునుడే. పాండవులందరును వారి ధర్మ ఆచరణముద్వారా భగవత్ప్రీతిని పొందినవారే. అందు విశిష్టమైన ప్రీతిని చూరగొన్నవాడు అర్జునుడు. శివకేశవులకు ఒకరియందు మరియొకరికి అమితమగు ప్రీతి. అర్జునుడు శివాంశ సంభూతుడు. స్థితి కారకుడగు విష్ణువు భూమిపై ధర్మము నెలకొల్పుటకు దేహమును ధరించినపుడెల్ల దుష్ట సంహా రమునకై లయకారకుడైన శివుడు సహకరించును. రాముడుగ అవతారమును ధరించినపుడు శివతత్త్వము హనుమగ తోడ్పడినది. కృష్ణునిగ దిగివచ్చినపుడు అర్జునుడుగ తోడ్పడినది. శివకేశవులు అవినాభావ సంబంధము కలవారు. ఒకే నాణెమునకు రెండు

ముఖములుగ వారిరువురును ఏర్పడిరి. అట్లు ప్రస్తుతమున బోధలందుకొను రూపమున నున్న అర్జునుడు తానే అని పలికినాడు. అంతేకాక సృష్టి శాశ్వతకథ యందు వారిరువురును శాశ్వతులైన నర నారాయణులు. అర్జునుడు నరుడు. కృష్ణుడు నారాయణుడు. నరుని వైభవమును పూర్ణముగ అర్జునుని యందు దర్శింపవచ్చును.

**3. వ్యాసుడు** : మునులలో నేను వ్యాస మహర్షిని అని దైవము పలికినాడు. వ్యాసుని నామధేయము కృష్ణద్వైపాయనుడు. ఆ రూపముననే కలియుగమునకు అజ్ఞానమను చీకటిని తొలగించుటకై బోధకుని రూపమున దైవము చరించినాడు. భారత భాగవతాది గ్రంథములను, పురాణములను, బ్రహ్మ సూత్రములను లోకమున కందించినాడు. వేదములను వర్గీకరించి నాలుగు వేదములుగ ఏర్పరచినాడు. ప్రస్తుతమున దైవము అర్జునునికి చేయు బోధన లిఖించుచు లోకమునకు భగవద్గీత నందించినాడు. భగవద్గీతను మించిన ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము మరియొకటి లేదు. వ్యాసుడే అవతరించనిచో కలియుగమున జ్ఞానమునకు ఆస్కారమే యుండెడిది కాదు. వ్యాస మహర్షియే కలియుగమునకు మొట్టమొదటి ప్రబోధకుడు. ఎవరెన్ని రచనలు చేసినను, వ్యాఖ్యానములు చేసినను అవియన్నియు వ్యాస విరచితమగు జ్ఞాన మందలి తరంగముల వంటివే. వశిష్ఠ ప్రపౌత్రుడు (ముని మనుమడు) విష్ణువు బోధనాత్మక అవతారము. రూపుకట్టుకున్న

బ్రహ్మమే అతడు. కర్కాటక పౌర్ణమి వ్యాసాంకితముగ గురు పూర్ణిమయై కలియుగ ఆసాంతము నిలచియుండును. అట్లు జగద్గురువగు వ్యాస మునీంద్రుడు నేనే అని దైవము పలికినాడు.

**4. ఉశనసుడు** : శుక్ర ప్రజ్ఞను ఉశనస ప్రజ్ఞ యందురు. కవులలో ఉశనసుడను నేను అని దైవము పలికినాడు. కవియనగా సృష్టించువాడని ఒక అర్థము. సృష్టి చతుర్ముఖ బ్రహ్మ ఆధ్వర్యమున నిర్మింపబడినను తామరతంపరగ జీవులు నిరంతరము రూపములు ధరించుటకు తోడ్పడునది శుక్రప్రజ్ఞయే. శుక్రము వలననే జీవులకు సంతానోత్పత్తి కలుగుచుండును. శుక్రధాతువు లోపించిన జీవికి సంతానము కలుగదు. సృష్టి ఉత్పత్తి కార్యక్రమము ఆగి పోవును. దేహము ధరించిన జీవులు మరికొందరు జీవులకు దేహము నందించుటవలన సృష్టి కొనసాగుచు నుండును. అట్లు నిర్వర్తించుట సృష్టి ధర్మములలో నొకటి. కనుక శుక్ర ప్రజ్ఞ సృష్టి నిర్వహణ ప్రజ్ఞలలో ప్రధానమగు ప్రజ్ఞ.

మరణించిన జీవుడు మరల దేహధారణము చేయుటకు శుక్రమే ఆధారము. కనుక మృతసంజీవని విద్య శుక్రస్వరూపమైన శుక్రాచార్యుని వద్ద ఉన్నదని ఋషులు తెలిపినారు. శుక్రుని వలననే ప్రజాతంతువు తెగక సాగుచున్నది. కనుక ప్రజాక్రతువునకు శుక్రుడే ఆచార్యుడు.

మరియొక విశేష మేమనగ శుక్రుడు రూపములను చిత్రించుచు నుండును. ఆయా జీవులకు ఆ జాతి జీవులే

జన్మించుట కూడ శుక్రప్రభావమే. మనిషికి జంతువు, జంతువునకు పక్షులు, పక్షులకు పాములు జన్మించుట జరుగదు. కుక్కకు కుక్కయే పుట్టును. పిల్లి పుట్టదు. మరల మరల జీవునికి దేహము లేర్పరచుట, ఆ దేహములను తలిదండ్రుల రూపమున చిత్రీక రించుట, మరణించినవారు మరల జీవించుటకు అవకాశము కల్పించుట సృష్టియందు అత్యంత విశేషమగు కార్యము. అట్టి కార్యము నిర్వర్తించు ఉశనసుడు (శుక్రాచార్యుడు)గ తానే యున్నా నని దైవము పలుకుచున్నాడు. ఉశనసుని మించిన కవి యనగా సృష్టికర్త మరియొకడు లేడు.

(31)

## దండనము - నీతి - మౌనము - జ్ఞానము

**దండో దమయతా మస్మి నీతి రస్మి జిగీషతామ్ ।**
**మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతా మహమ్ ॥ 38**

*తాత్పర్యము :* దండనము నేను. జయమందు నీతిని నేను. రహస్యములలో మౌనము నేను. జ్ఞానులలో జ్ఞానము నేను.

*వివరణము :* **1. దండనము :** దండనము, ధర్మ నిర్వహణ మున చివరి ఉపాయము మరియు కర్మ క్షాళనమునకు కూడ లోకమున దండనము జరుగుచు నుండును. రాజాధికారము గలవారు దండనము నిర్వర్తింతురు. అట్టి దండనమున దండింప బడినవారు క్షాళనము పొందుదురు. పూర్వ యుగములలో అధర్మ ప్రవర్తనము తమ నుండి నిర్వర్తింపబడినపుడు సత్పురుషులు రాజువద్దకేగి తగిన దండనము కోరెడివారు. రాజదండనమున దండితునికి పూర్వ పవిత్రత లభించును. రాజు లేక అధికారి విష్ణువు అంశ ధరించి యుండుటచే, రాజదండనమునకు అట్టి గౌరవ ముండెడిది.

లోకమున ధర్మము తప్పిన జీవునికి కర్మ మేర్పడుచు

నుండును. అట్టి కర్మము శిక్షింపబడినపుడే జీవునికి కర్మ క్షాళన మగుచుండును. తీవ్రమగు అనారోగ్యము, కష్టనష్టములు, సంఘ మున అవమానము, కుటుంబమున అకాలమరణము ఇత్యాది వన్నియు పూర్వకర్మ ఫలములే. కాలము రూపమున దైవమే జీవులను శిక్షించుచు నుండును. దండించుచు నుండును. శిక్షింప బడినవారు పునీతులగు చుందురు. ఇట్టి దండన ముండనముల ద్వారా జీవులను పునీతులను చేయునది "నేనే" అని దైవము పలుకుచున్నాడు. కేవలము పశ్చాతప్తు లగుట వలన కర్మఫలము నశింపదు. దండనమున మాత్రమే మరల ధర్మమార్గము లభిం చును. ఎవరు చేసుకున్న కర్మమే వారికి శుభాశుభ ఫలితములు అందించునని భారతీయు లందరికిని విదితమగు విషయము.

**2. నీతి-జయము** : నీతి అనునది ధర్మమునకు పర్యాయ పదము. నీతి గలవాని జయము శాశ్వతమై యుండును. నీతి లేనపుడు జయము తాత్కాలికమే యగును. అధర్మము జయించి నను అది స్థిరత్వము నీయదు, ఆనందమీయదు. నిత్యము భయము, ఆందోళన కలిగించు చుండును. కంసుని భయము, రావణుని ఆందోళన వారి ప్రవర్తన యందలి అధర్మమే. అట్లే దుర్యోధనుడు, కర్ణుడు, శకుని మొదలగువారు అధికారము, ఐశ్వర్యము నందున్ననూ వారికానందము మృగ్యము. లోకమందు అధికారులు, ఐశ్వర్యవంతులు అధికముగ ఆందోళనమున జీవించుటకు కారణము, వారియందు నీతి లేకుండుటయే.

జయము కలిగియున్నను, నీతి లేమి వలన భయాందోళన లుండును. నీతిగల వాని జయము, వారికి శాశ్వత ఆనందము లభింపజేయును. నీతిలేని జయము వ్యర్థము. కనుక జయింప నిచ్ఛగలవారు నీతితో కూడి ప్రయత్నింపవలెను. లోకమున పరుల ధనమును, పరుల స్త్రీలను అపహరించువారికి పతనము తప్పదని తెలుపు ఇతిహాసములే భారత రామాయణములు. నీతిని ధరించిన వాడే జయము పొందినవాడు. అన్నిటికన్న విశేషమగు జయము ధర్మము నాశ్రయించి, ధర్మమునే ధరించి యుండుట.

**3. మౌనము** : రహస్యగోపనము అందరికిని సిద్ధింపదు. ఎంత దాచినను రహస్యము తెలియబడును. మౌన మొక్కటే రహస్యమునకు ఉపాయము. మౌనము లేనివారు రహస్యము లను అప్రయత్నముగనే ప్రకటింతురు. ఎవనియందు మౌనము భూషణమై యుండునో, అట్టి వానియందు రహస్యము పదిలమై యుండును. ఏ దేశమందైనను గూఢచారులు రాణించుటకు మౌనము ప్రధానము. అతిక్రమించి భాషించువారు రహస్యమున కనర్హులు. అట్టి వారిని విశ్వసించి ఎట్టి రహస్యములు తెలుప రాదు. గుహ్య మనగా రహస్యము. మునులు హృదయ గుహ యందుండి, అత్యవసరమైనగాని భాషింపరు. వారి భాషణములో లోకరీతులకు అంతగ తావుండదు.

**4. జ్ఞానము** : జ్ఞానవంతులలో జ్ఞానముగ ప్రకాశించునది

దైవమే. జ్ఞాని జ్ఞానముచే పొందబడి యుండును. జ్ఞానము జ్ఞానియొక్క అంతిమస్థితి. అయస్కాంతము జ్ఞానము వంటిది. జిజ్ఞాసువు అయస్కాంతమును చేరు ఇనుపముక్క వంటివాడు. అయస్కాంత సాన్నిధ్యమును చేరిన ఇనుపముక్క క్రమముగ అయస్కాంతమై పోవును. అట్లే జిజ్ఞాసువు జ్ఞానసముపార్జనలో మునిగి జ్ఞాని యగును. అనగా జ్ఞానమునకు వ్యక్తరూపమై యుండును. జ్ఞాని యనగా నేనే అని దైవము ముందు అధ్యాయములలో పలికినాడు. ఇపుడు జ్ఞానియందలి జ్ఞానముగ ఉన్నది నేనే అనుచున్నాడు. జ్ఞానమనగా జ్ఞాని-జ్ఞానము-జ్ఞాన సముపార్జనము ఒకటై పోవుట. కేవలము జ్ఞానమే యుండుట. దానినే కైవల్య పదమని తెలిపియున్నారు.

(32)

## బీజ స్వరూపము

**యచ్చాపి సర్వభూతానాం బీజం తదహ మర్జున ।**
**న తదస్తి వినా యత్స్యా న్మయా భూతం చరాచరమ్ ॥ 39**

*తాత్పర్యము :* మరియు సమస్త ప్రాణికోటికి బీజము నేనే. నేను లేని చరాచరము లేవియు లేవు.

*వివరణము :* దైవమే సృష్టి, సృష్టిజీవులు. పుట్టిన చరాచర భూతము లన్నియు దైవము నుండే పుట్టినవి. దైవమే మూలము. దైవమే బీజము. తాను ప్రకృతికి మూలము. తన్ను ఆధారముగ జేసుకొని సమస్త లోకములు, లోకులను, లోకపాలకులను ప్రకృతి ఏర్పరచుచున్నది. ప్రకృతి మూలము నేను. మూలమగు బీజము నుండి మొక్క, వృక్షము, శాఖోపశాఖలు, రెమ్మలు, ఆకులు, పుష్ప ములు, ఫలములుగ సృష్టి వ్యాప్తి చెందుటకు, అందంతర్హితమై యున్నది నేనే. నేను లేనిదే ఉత్పత్తి లేదు, వృద్ధి లేదు. సమస్తము నానుండే, బీజము నుండి వృక్ష మేర్పడినట్లు ఏర్పడు చున్నది. కనుక కనిపించు సమస్త సృష్టి తన వ్యక్తరూపమే. బీజము నుండి పుట్టిన వృక్షము బీజము కన్న వేరు కాదు గదా! నానుండి పుట్టిన

ప్రకృతి నుండి పుట్టిన సర్వస్వము నేనే వ్యాప్తిచెంది యున్నాను. బీజమందలి అంకుర శక్తి గోచరింపదు. అంకురము, వృక్షము ఇత్యాదివి గోచరించును. ఈ గోచరించుచున్న సమస్త సృష్టి నేనే. అంతకుమించి గోచరింపని స్థితి యందు కూడ యున్నాను. నేను వ్యక్తుడను, అవ్యక్తుడను కూడ. నేను మూలముగ ప్రకృతి అనేక ప్రకృతులుగ ఏర్పడి, అనేక స్వభావములుగల జీవుల నుత్పత్తి చేయుచున్నది. కాని వాని మూలమున నున్నది నేనే. అన్నిటి యందు నేనే నిండియున్నాను. వాని నతిక్రమించి కూడ నేనే యున్నాను. నేను లేనిదేమియు లేదు. ఇది నా భూత మహేశ్వర స్థితి.

## 33

## దైవ విభూతులు

**నాంతో౽స్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప ।**
**ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతే ర్విస్తరో మయా ॥ 40**

**యద్య ద్విభూతిమ త్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్త దేవావగచ్ఛ త్వం మమ తేజో౽ంశసంభవమ్ ॥ 41**

*తాత్పర్యము :* నాయొక్క దివ్యములైన విభూతులకు అంతము లేదు. అయినను నీ కొరకు కొన్ని సంక్షిప్తముగ వివరించితిని.

కాంతివంతమైనది, ఉత్సాహవంతమైనది, తేజోవంతమైనది, వైభవముగ గోచరించునది నీకేది తటస్థపడినను, అది నేనే అని నీవెరుంగుము.

*వివరణము :* దేనిని విన్నను, చూచినను, రుచి చూచినను, స్పర్శించినను, వాసన చూచినను నీకప్రయత్నముగ వికాసము, తదనువగు ఆనందము కలిగినచో ఆ వస్తువు రూపమున నన్ను గుర్తించుమని ఒక ఉపాయము తెలిపినాడు. కొన్ని పర్వతములు చూచినపుడు, నదీ ప్రవాహములు చూచినపుడు, మహావృక్షములు చూచినపుడు జీవుల కప్రయత్నముగ ఆనందము కలుగును. అట్లే

కొన్ని పక్షులను చూచినపుడు, జంతువులను చూచినపుడు కూడ ఆనందము కలుగును. పుష్పములు, ఫలములు నిండుగ పూచినపుడు ప్రయత్నము లేకయే ఆనందము కలుగును. అట్లే కొందరి మానవ రూపములు చూచినపుడు ఆనందము ఉబుకును. సూర్యోదయము, సూర్యకాంతి, చంద్రోదయము, చంద్రకాంతి, జీవుల కన్నుల యందలి కాంతి, తారకల యందలి కాంతి, ఆకాశపు కాంతి, తెల్లని మబ్బుల కాంతి- ఇత్యాదివి చూడగనే ఆనందము కలిగించును. తెల్లని మబ్బు, ఇంద్రధనుస్సు, చల్లని గాలి జీవుల కానందము కలిగించును. ఇట్లు సృష్టి యందు కాంతి వంతము, ఆనందదాయకము అగు ప్రాణులు, రూపములు చూచునపుడు అది దైవవిభూతి, దైవకాంతి అని తెలియవలెను.

అట్లే అపురూపమగు, శక్తివంతమైన ప్రాణుల యందు ప్రాణము, తేజస్సు కూడ దైవమే అని తెలియవలెను. ఏనుగు, ఎద్దు, సింహము, శార్దూలము ఇట్టి వానియందలి బలము, శక్తి దైవముగ గుర్తింపవలెను. అశ్వమునందలి ఉత్సాహము, శునకము నందలి అప్రమత్తత, గోవుల యందలి సాధుత్వము, ఆబోతుల యందలి హుందాతనము దైవముగ గుర్తించి ఆనందింపవలెను.

ఎచ్చట ప్రాణము, శక్తి, తేజస్సు, అందము, ఉత్సాహము, పరాక్రమము, మనోనైర్మల్యము, ధర్మవర్తనము గోచరించునో ఆయా గుణములుగ, ఆయా రూపములలో తన అస్థిత్వమును దర్శింపుమని తన విభూతులను పరిపూర్ణముగ తెలిపినాడు.

చిట్టచివరకు క్లుప్తముగ ఒక్క వాక్యము తెలిపినాడు.

34

## సమస్తము దైవమే !

**అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।**
**విష్టభ్యాహమిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్ ॥ 42**

తాత్పర్యము : అర్జునా! అతి విస్తారమైన నా విభూతి, వైభవము ఎంత తెలిపినను నీకు పరిపూర్ణము కానేరదు. ఒకే ఒక విషయ మును గుర్తుంచుకొనుము. నేనొక్కడినే ఏకాంశముగ ఈ సృష్టి యందున్నాను. ఇతర మేమియు లేదు.

వివరణము : సమస్తము దైవము. దైవము కానిదేదియు లేదు. అత్యుత్తమము - అతి నీచము, అతి పవిత్రము - అతి మలినము, అతి సుందరము - అతి వికృతము అంతయు దైవమే. అన్యమేమియు లేదు. అతడే అత్యంత వైవిధ్యముగ సృష్టియందు వ్యాప్తిచెంది యున్నాడు. పరస్పర విరుద్ధమగు విషయములందు గూడ మూలముగ తానే యున్నాడు. ఈ అనన్యత్వము తెలిసిన వారికి జ్ఞానము పరిపూర్ణము. అట్టి వాడన్నిటియందు దైవమునే చూచుచు నుండును. తన కర్తవ్యమును నిర్వర్తించుచు, దేనిని నిరాదరణ చేయక, నిరాకరించక యుండును. అట్టి వారే సిద్ధులు. వారికంతయు దైవమే! అంతయు బ్రహ్మమే! సృష్టి అతని

విలాసముగ భావించుచు, దర్శించుచు వినమ్రులై తమ కర్తవ్యము నిర్వర్తించుచు నుందురు. వారికి జరుగుచున్న దంతయు దైవమే. దైవమునే సృష్టియని, సృష్టిని దైవముగను దర్శించుచు నుందురు. "*ఇతి ఏతత్*" ఇది అంతయు అదియే, "*మా మా బ్రహ్మ నిరాకరోతు, అనిరాకరణమస్తు, అనిరాకరణమస్తు*" బ్రహ్మమును నిరాకరించకుందును గాక! అనిరాకరణ స్థితి యందుందుము గాక! ఇట్టి ఉపనిషత్ వాక్యములే ఈ శ్లోక సారాంశము. ఇట్టి స్థితి యందున్నవారు పూర్ణసిద్ధులు. అట్టి వారికి దైవ విభూతి యోగము సంపూర్ణమై యుండును.


*శ్రీమద్భగవద్గీత యందలి 10వ అధ్యాయము*


*'విభూతి యోగ' వివరణము*

*సంపూర్ణము.*

# ధనిష్ఠ ప్రచురణలు















ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

భగవంతుని విభూతులలో అతి ప్రధానమైన విభూతి అన్ని ఆత్మలయందు తానే వసించి యుండుట. కనుక భగవత్ సాన్నిధ్యము కోరువారు వారి హృదయ మందలి అంతరాత్మను సమీపించుట, సన్నిధి చేరుట, దర్శించుట, అటుపైన అంతరాత్మ తానుగా నున్నాడని తెలియుట సాధించుకొన వచ్చును. ఆత్మలకు ఆత్మగా నున్నవాడను 'నేనే' అని దైవము పలుకుటలో అతని భూతమహేశ్వరత్వము తెలియుచున్నది. అతడాధారము గనే ఆత్మలకు పుట్టుట, పెరుగుట, నశించుట జరుగుచు నుండును. అతని నుండే సమస్తము వ్యక్తమై, అతని లోనికే సమస్తము లయ మగును.

"నాకన్న ఇతర మేమియు లేదు– మత్తః పరతరం నాస్తి" అని దైవము ప్రకటించినాడు. ఎన్నిమార్లు భగవద్గీత చదివినను తెలియవలసినది ఇది ఒక్కటియే.

ISBN 978-81-89467-39-5

9 788189 467395 >

ధనిష్ఠ